లక్నవరానికి జలకళ

16లో..



ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం 21 ఆగస్టు 2017 | 16 పేజీలు



11 నుంచి 7

కేయూలో తగ్గిన జిల్లాల పరిధి

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధి తగ్గింది. ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని 11 కొత్త జిల్లాల్లో ఉన్నత విద్యను అందిస్తున్న కేయూ ఇక నుంచి 7 జిల్లాలకే పరిమితం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిజామాబాద్‌లోని తెలంగాణ, కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయాల పరిధిలోకి కొన్ని జిల్లాలను తీసుకొచ్చింది. వచ్చే ఏడాది నుంచి అమలు చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మొత్తం కేయూ పరిధిలో ఉంది. ఈ జిల్లా నాలుగు జిల్లాలుగా విడిపోయింది. ఆదిలాబాద్, నిర్మల్ తెలంగాణ విశ్వవిద్యాలయం, మంచిర్యాల, కొమ్రం భీం, ఆసిఫాబాద్ జిల్లాలు కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోకి వెళ్తున్నాయి. కేయూ వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలకే పరిమితమవుతుంది.

తగ్గుతున్న కళాశాలలు: 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కేయూ పీజీ కేంద్రం ఏర్పాటైంది. హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు (మిగతా 2లో)

అంతర్జాలం.. ఆలస్యం

ఇళ్ల నిర్మాణాల అనుమతుల్లో జాప్యం

ఫలితంగా పెరుగుతున్న అక్రమ కట్టడాల జోరు

పురపాలికల ఆదాయానికి గండి

భూపాలపల్లి, న్యూస్‌టుడే



గతంలో ఇల్లు కట్టుకోవాలంటే ప్రైవేటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా ప్లాన్లు(నక్షాలు) గీసి పురపాలికల్లో దరఖాస్తు చేసేవారు. ట్రేసర్ వేసిన ఫీజులు చెల్లించే వారు. అనుమతి కోసం రోజుల తరబడి తిరిగే వారు. అధికారులకు ఎంతోకొంత సమర్పించుకుంటేనే దస్త్రం ముందుకు కదిలేది. ఈ క్రమంలో అవినీతి కట్టడికి ప్రభుత్వం గతేడాది జూన్ నుంచి కొత్తగా ఆన్‌లైను బిల్డింగ్ ఆప్లికేషన్ విధానం అమల్లోకి తీసుకొచ్చింది. పేరుకు మాత్రం అంతర్జాలం సేవలు.. వాస్తవంగా పరిశీలిస్తే ఆలస్య సేవలకు చిరునామాలా మారింది. నెలల తరబడి దస్త్రాలు ముందుకు కదలడం లేదు. నిబంధనల ప్రకారం అన్ని ఉన్నా భవన నిర్మాణ అనుమతులు రావడం లేదు. దీంతో చాలా మంది అక్రమ కట్టడాల బాట పడుతున్నారు..

పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉంది భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం. సులభతరం.. సత్వరం. పారదర్శకమంటూ కొత్తగా (మిగతా 2లో)

ఇదీ నిబంధన

ప్రైవేటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా ప్లాను(నక్షా) గీయించాలి. అతని లాగిన్ ద్వారా ఆన్‌లైనులో బిల్డింగ్ ఆప్లికేషన్ సమర్పించాలి. రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన సిటిజన్ ఛార్టర్ ప్రకారం 30 రోజుల్లో అనుమతి ఇవ్వాలి. దస్త్రం ఏ స్థాయిలో ఉందో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. అనుమతి వచ్చిన తర్వాత ప్రొసీడింగ్ పత్రం సర్వేయర్ వద్దే పొందాలి. కార్యాలయానికి వెళ్లాల్సినవసరం లేదు. గడువు దాటితే సంబంధిత అధికారుల నుంచి జరిమానా వసూలు చేయొచ్చు.

దరఖాస్తులు	58
పరిష్కారం	27
పెండింగ్	13
పరిశీలన	11
తిరస్కరణ	7
అనధికారిక నిర్మాణాలు..	1000 పైగా..

వివిధ శాఖలు పంపిన ప్రతిపాదనలు(రూ.కోట్లలో)

రోడ్లు, భవనాలు	74.50
ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్	30
దేవాదాయ	2.60
పంచాయతీరాజ్	3.46
నీటిపారుదల	1.00
వైద్య ఆరోగ్యశాఖ	1.33
గిరిజన ఇంజినీరింగ్(ఐటీడీఏ)	8.30
విద్యుత్తు	4.08
ఆర్టీసీ	2.48
జిల్లా పంచాయతీ అధికారి	1.50
పోలీస్	15.00
రెవెన్యూ	2.00
ఎక్సైజ్	0.19
ప్రచార, పౌరసంబంధాలు	0.14
పశుసంవర్ధక	0.12
టూరిజం	0.02
మత్స్యశాఖ	0.10
అగ్నిమాపక	0.32
గిరిజన అభివృద్ధి	0.12
రవాణా	0.06

ఇంకెప్పుడు?

మరో ఐదు నెలల్లో మేడారం మహాజాతర

ఇంకా పనులు మొదలుపెట్టలే!

పాత బాటలోనే అధికార యంత్రాంగం



మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయం ముంచుకొస్తోంది.. ఇంకా ఐదు నెలల గడువు మాత్రమే ఉంది. వచ్చే ఏడాది జనవరి 31న ప్రారంభమవుతుంది. కోటి మందికి పైగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. హడావుడిగా పనులు చేపట్టడానికి స్వస్తి చెప్పాలని నిర్ణయించింది. కనీసం ఆరు నెలల ముందుగా పనులు మొదలు పెడితే జాతర నాటికి పూర్తిచేయవచ్చని భావించింది. ఆగస్టు రెండోవారం నాటికి టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని ప్రకటించిన అధికార యంత్రాంగం మాటతప్పింది. ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ ప్రారంభించనేలేదు.

న్యూస్‌టుడే, భూపాలపల్లి టౌన్

ప్రస్తుతం ఆగస్టు మూడో వారంలోకి అడుగుపెట్టాం. మేడారం జాతర అభివృద్ధి పనుల టెండర్ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నెల రోజులైంది. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కొత్త జిల్లాల ఆవిర్భావం తర్వాతైనా జిల్లా అధికార యంత్రాంగంలో మార్పు కన్పించడం లేదు. అధికారులంతా ఇంకా పాత పద్ధతిని మరిచిపోయినట్లు లేరు. జాతర ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తిచేసే దాఖలాలు కన్పించడం లేదు. షార్ట్ టెండర్లు (మిగతా 2లో)

గ్రానైట్‌పై జీఎస్టీ శాతాన్ని తగ్గించాలి

వివరాలు 6లో...

ప్రతిభావంతులను గౌరవించుకోవడం మన సంప్రదాయం

వివరాలు 7లో...



తాడ్వాయి మండలం వెంగళాపురం సమీపంలో పొంగి ప్రవహిస్తున్న యాసంగి వాగు

వాన జోరు

నిండిన చెరువులు, కుంటలు

జయశంకర్ భూపాలపల్లి : ఉమ్మడి వరంగల్ జిల్లా జోరు వానలో ముద్దయింది. మొదటిసారి రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలో మొదటిసారి 24 గంటల వ్యవధిలో అత్యధికంగా 212.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు కురిసిన వర్షాలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని 2350 చెరువులు నిండిపోయాయి. 1000 చెరువులు, కుంటల వరకు మత్తళ్లు పోస్తున్నాయి. ఖరీఫ్ పంటలకు భయం లేదని (మిగతా 2లో)

11నుంచి 7కు..

(మొదటిపేజీ తరువాయి) చేశారు. 1976 ఆగస్టు 19న కాకతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. అప్పటి కేంద్ర విద్య శాఖ మంత్రి నూరుల్‌హాసన్ ప్రారంభించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, రసాయశాస్త్రంతో కేయూ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత వృక్ష, జంతు శాస్త్రలు, వాణిజ్య, ఎకనామిక్స్, ప్రభుత్వ పాలనాశాస్త్రం, భౌతికశాస్త్రం, ఫార్మాసీ కోర్సులను ప్రవేశపెట్టింది. కేయూ ప్రథమ ఉపకులపతిగా భౌతిశాస్త్రం సీనియర్ చార్యులు బాధ్యతలు చేపట్టారు. 1979 నుంచి తన పరిధిని విస్తరిస్తూ వచ్చిన కేయూ 1985 వరకు వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నత విద్యను అందించింది. ఎంఫిల్, పీహెచ్‌డీతో పాటుగా ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, న్యాయ, ఫార్మసీ, డిగ్రీ కళాశాలల్లో విద్యను అందిస్తూ వస్తోంది. 2008లో కరీంగనగర్‌లో శాతవాహన విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 2010లో కేయూ పరిధిలో ఉన్న 136 డిగ్రీ, 30 పీజీ, 20 బీఈడీ, 9 ఎంబీఏ, 4 ఫార్మసీ, ఒక న్యాయ కళాశాలను 'శాతవాహన'లో కలిపారు. కేయూలో అప్పటి వరకు ఉన్న 703 కళాశాలల నుంచి 200 శాతవాహనకు వెళ్లాయి. ఇప్పుడు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు తెలంగాణ, శాతవాహన విశ్వవిద్యాలయాల పరిధిలోకి పోతే ఇక కేయూకు 383 కళాశాలలు మాత్రమే ఉంటాయి. కేయూ పరిధిలోని కళాశాలలకు అనుమతులు ఫీజులు వస్తాయి. నాలుగు జిల్లాల నుంచి 2010 వరకు ఏడాదికి సూమారుగా రూ.3 నుంచి 4 కోట్ల వరకు వచ్చేవి. వీటితో పాటుగా ప్రతి విద్యార్థిపై విశ్వవిద్యాలయం ఫీజును వసూలు చేస్తుంది. వీటిని కళాశాలలు వారే వసూలు చేసి కేయూకు చెల్లించేవారు. ఈ ఫీజులు గతంలో సూమారు రూ.15 కోట్లు వచ్చేవి. కరీంనగర్‌లో శాతవాహన ఏర్పాటు తర్వాత ఫీజుల ఆదాయం సూమారు రూ.11 కోట్లకు పడిపోయింది. వచ్చే విద్యాసంత్సరం నాటికి ఈ ఆదాయం మరింత తగ్గుతుంది. మరో వైపు దూరవిద్యా కేంద్రంలో ఉన్న అధ్యాయన కేంద్రాలు 170 నుంచి 80 వరకు తగ్గాయి. వీటి ద్వార వచ్చే ఆదాయం కూడా గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

వాన జోరు

(మొదటిపేజీ తరువాయి) అధికారులు వెల్లడించారు. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలో 212.2 మిల్లీమీటర్లు నమోదైంది. నల్లబెల్లిలో 192.0, శాయంపేటలో 161.0, ఆత్మకూరులో 152.4, గీసుకొండలో 93.4, పరకాలలో 90.2, సంగెంలో 54.4, నర్సంపేటలో 50.7, చెన్నారావుపేటలో 47.8, ఖానాపురంలో 40.2, నెక్కొండలో 32.2, పర్వతగిరిలో 25.4, రాయపర్తిలో 25.2, వర్ధన్నపేటలో 25.0 మిల్లీమీటర్ల చొప్పున నమోదైంది. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని హసన్‌పర్తిలో 100, ఎల్కతుర్తిలో 87.2, వరంగల్‌లో 83.6, హన్మకొండలో 79.4, కాజీపేటలో 79.4, ఖిలావరంగల్‌లో 75.3, ధర్మసాగర్‌లో 63.2, కమలాపూర్‌లో 63.2, భీమదేవరపల్లిలో 48.4,ఐనవోలులో 32.0 మిల్లీమీటర్ల చొప్పున నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్‌లో 177.0, ములుగులో 136.8, గోవిందరావుపేటలో 136.4, రేగొండలో 92.4, చిట్యాలలో 78.6, మొగుళ్లపల్లిలో 56.4, మల్హార్‌లో 46.0, గణపురంలో 39.5, టేకుమట్లలో 36.6, భూపాలపల్లిలో 34.2, కన్నాయిగూడెంలో 33.8, వెంకటాపురంలో 34.4, ఏటూరునాగారంలో 32.4, బలిమెలలో 29.4, ముత్తారంలో 25.8, మహదేవ్‌పూర్‌లో 25.7, మంగపేటలో 26.7, వాజేడులో 23.3, తాడ్వాయిలో 20.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. జనగామ జిల్లా జఫర్‌గడ్‌లో 52 , స్టేషన్‌ఘన్‌పూర్‌లో 43.2, తరిగొప్పులలో 33.8, రఘునాథపల్లిలో 31.2, పాలకుర్తిలో 31.1, బచ్చన్నపేటలో 27.2, లింగాలఘనపురంలో 25.8, నర్మెట్టలో 29.3, జనగామలో 21.5, దేవరుప్పుల, కొడకండ్లలో 20.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని కొత్తగూడలో 48.4, గూడురులో 32.2, గంగవరంలో 29.5, తొర్రూరులో 22.9, కేసముద్రంలో 21.3, దంతాలపల్లిలో 19.0 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

అంతర్జాలం.. ఆలస్యం

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో మ్యాన్‌వల్ పద్ధతి అయితే నెలరోజుల్లో అనుమతులు వచ్చేవి. తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ ప్రవేశపెట్టిన డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీపీఎంఎస్) ద్వారా నాలుగైదు నెలలైనా భవన నిర్మాణాలకు అనుమతులు రావడం లేదు. ప్రైవేటు లైసెన్సుడ్ సర్వేయర్ల చుట్టూ తిరిగి ప్రజలు ఆలసిపోతున్నారు. అధికారికంగా అనుమతులు రావడం లేదు. ఫలితంగా అనాధికారిక నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో పురపాలికల ఆదాయానికి గండి పడుతోంది. ఆన్‌లైను బిల్డింగ్ విధానం టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసుల పంట పండిస్తోంది. అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. వరంగల్ మహా నగరపాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్ మున్సిపాలిటీలు, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి నగర పంచాయతీల్లో వసూళ్ల దందా కొనసాగుతోంది. అధికారులు, పాలకవర్గం పెద్దలు ఒక్కటయ్యారు. అనధికార కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు. ఆన్‌లైను బిల్డింగ్ అప్లికేషన్ విధానంపై టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ప్రైవేటు సర్వేయర్లకు అవగాహన లేదు. 2-3 సార్లు శిక్షణ ఇచ్చినప్పటికీ పూర్తిగా అవగాహన రాలేదు. ప్రజల్లో ఏమాత్రం ప్రచారం లేదు. ఈ కారణంగా కూడా చాలా మంది అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నారు.

గ్రేటర్ వరంగల్‌లో ఇలా..:

వరంగల్ మహా నగరంలో అక్రమ నిర్మాణాల పేరుతో వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. కొందరు కార్పొరేటర్లు, టౌన్‌ప్లానింగ్ క్షేత్రస్థాయి అధికారులు ఒక్కటయ్యారు. ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా అనధికారిక కట్టడాలను ప్రోత్సాహిస్తున్నారు. ఇలాంటి వాటిని కట్టడి చేయాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అనధికారిక కట్టడాలతో మహా నగరపాలక సంస్థకు బెటర్‌మెంటు ఛార్జీలు, ప్లానింగ్ ఫీజుల ఆదాయం గణనీయంగా పడిపోయింది. రెండేళ్ల క్రితం ఏటా రూ.2.50కోట్ల ఆదాయం వచ్చేది. ఈ ఏడాది రూ.కోటి దాటా లేదు. గోపాలపురం, కోమటిపల్లి, భీమారం, రంగశాయిపేట, సాయినగర్ కాలనీ, గణేశ్‌కాలనీ, రాంగోపాలపురం, నాయుడు పంపు దగ్గర, కీర్తినగర్ కాలనీల్లో బిల్డర్లు వ్యక్తిగత భవనాలు నిర్మించి అమ్మకాలు చేస్తున్నారు. వాస్తవంగా పరిశీలిస్తే ఇందులో 80 శాతం వాటికి అధికారికంగా అనుమతులు రావు. ఎల్ఆర్ఎస్ ఉంటేనే భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. బిల్డర్లు మాత్రం రూ.2500 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించేసి దర్జాగా భవనాలు నిర్మాణం చేస్తున్నారు. ఒక్కో భవనం నుంచి లకరం వసూలు చేస్తున్నట్లుగా తెలిసింది. 42 విలీన గ్రామాల్లో అయితే పరిస్థితి మరి దారుణంగా ఉంది. అక్కడన్నీ అక్రమ నిర్మాణాలే. పెద్దఎత్తున వసూళ్లు జరుగుతున్నట్లుగా తెలిసింది. కొన్ని ఫిర్యాదులు కమిషనర్ వద్దకు వచ్చాయి.

నర్సంపేటలో..: నర్సంపేట నగర పంచాయతీలోని పటేల్‌నగర్‌లో ఓ స్థిరాస్తి వ్యాపారి రెండు ఇళ్లకు ఎల్ఆర్ఎస్ చెల్లించి ఎటువంటి అనుమతుల్లేకుండా ఏడు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నగరపంచాయతీ అధికారులకు కేవలం జీ ప్లస్ వన్ నిర్మాణాల వరకే అనుమతిచ్చే అధికారముంది. కానీ పట్టణంలో నిబంధనలకు నీళ్లు వదిలి ఎటువంటి అనుమతుల్లేకుండా జీ ప్లస్ టూ(రెండు అంతస్తుల)భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించకోవడం లేదు. వసూళ్ల దందాను కొనసాగిస్తూ దండిగా దంటుకుంటున్నారు. కొందరు ఇంటి దస్తావేజులు, నిర్మాణ నక్షా నకలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు జత చేసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నిర్ణీత రుసం చెల్లించినా అనుమతుల్వికుండా రికార్డుల్లో పేర్లు మార్పిడి చేయకుండా సతాయించే అధికారులకు జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు మాత్రం కనిపించడం లేదు. పట్టణంలో హద్దు అదుపుల్లేకుండా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా వాటిపై కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా నగర పంచాయతీ ఆదాయానికి లక్షల రూపాయల్లో గండి పడుతుంది.

పరకాలలో: పరకాల నగర పంచాయతీలో అధికారికంగా మొత్తం 7,500 ఇళ్లు ఉన్నాయి. అనధికారికంగా, అక్రమంగా నిర్మించినవి మరో వందకుపైగా ఉన్నాయి. కొందరు కౌన్సిలర్లు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పరకాలకు చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఇంటిని నిర్మించుకున్నారు. అందుకు అనుమతి తీసుకోగా ఏడాదిలోనే పై అంతస్తును నిర్మించగా దానికి అనుమతి లేదు. ఓ వార్డులో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు మూడు అంతస్తుల భవనం నిర్మించారు. భూపాలపల్లి రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఓ కౌన్సిలర్ ఎలాంటి అనుమతి లేకుండా ఇంటిని నిర్మించగా పై అంతస్తు కూడా వేసుకున్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారు. హుజురాబాద్ రోడ్డులో కూడా ఒకరిద్దరు నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు.

మహబూబాబాద్‌లో: పురపాలక సంఘంలో అక్రమ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పురపాలక సంఘంలో 28 మంది వార్డు కౌన్సిలర్లు ఉండగా వారిలో 17 మంది ఇళ్ల నిర్మాణ అనుమతుల విషయంలో జోక్యం చేసుకుంటున్నారు. ప్రాంతీయ ఆసుపత్రి సమీపంలో ఓ వ్యాపారి ప్రధాన వీధిలో ఉన్న చేతి పంపును పూడ్చి అక్రమంగా ఇంటి నిర్మాణం చేశారు. పత్తిపాక వెళ్లే రహదారికి ఇరువైపులా బహుళ అంతస్థుల భవనాలు నిర్మాణం అవుతున్నా పట్టించుకోవడం లేదు. కంకరబోడ్ ప్రాంతంలోని ఇందిరాగ్రౌండ్‌లో, ఇల్లందు వెళ్లే రోడ్‌లో కురవి గేట్ ఎదురుగా, చివరి గేట్ నుంచి సిగ్నల్ కాలనీ వెళ్లే రహదారిలో, మరిపెడ వెళ్లే ప్రధాన రహదారిలో, కలెక్టర్ కార్యాలయం వెళ్లే రహదారిలో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న భవనాలకు ఎలాంటి అనుమతి లేదు. ఈ విషయమై పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

భూపాలపల్లి: భూపాలపల్లి నగర పంచాయతీలో అదే జోరు కొనసాగుతుంది. ఇక్కడ కౌన్సిలర్ల అనుమతి ఉంటే చాలు భవనం కట్టుకోవచ్చు. లేకుంటే చిన్నపాటి గోడ కట్టడం కూడా సులువు కాదు. ప్రతి నెలా సుమారు 50పై నిర్మాణాలు ప్రారంభమవుతున్నాయి. మంజూరుగనర్‌లో పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఓ రైతు రెండు అంతస్థుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. అనుమతి కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు పెట్టుకున్నారు. లింక్ డాక్యుమెంట్లు లేవని అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన రూ.10 వేలు అధికారులకు, మరో రూ.5 వేలు ఓ ప్రజాప్రతినిధికి ముట్టజెప్పి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. రెడ్డికాలనీ, రాంనగర్‌కాలనీలో ఇదే పరిస్థితి నెలకొంది. ఓ సింగరేణి కార్మికుడు అనుమతి కోసం దరఖాస్తు నెల రోజుల క్రితం పెట్టుకున్నాడు. ఎల్ఆర్ఎస్ కట్టకపోవటంతో అనుమతి రాదని అధికారులు చెప్పారు. దీంతో ఓ దళారి ద్వారా పనులు ప్రారంభించారు. రెండు మూడు సార్లు ఇంటి పనులను నిలిపివేయాలని సిబ్బంది వచ్చి చెప్పినా పనులు మాత్రం ఆగడం లేదు.

30 రోజుల్లో పరిష్కరించాలి

–విద్యాధర్‌రావు, డీటీసీపీ

భవన నిర్మాణ అనుమతులు పారదర్శకంగా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ ఆన్‌లైను బిల్డింగ్ అప్లికేషన్ విధానం అమల్లోకి తెచ్చింది. ఏ మున్సిపాలిటైనా సరే 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు పూర్తి చేయాలి. సాంకేతిక సమస్యల పేరుతో నెలల తరబడి దరఖాస్తులు తొక్కి పెడుతున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా మా దృష్టికి తేవాలి. గత జూలై 20 తేదీ నుంచి కొత్త సాప్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. మారుతున్న కాలానికనుగుణంగా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మారాలి. ఆధునిక సేవలు అంది పుచ్చుకోవాలి. అక్రమ నిర్మాణాలనే సహించేది లేదు. తప్పు చేసిన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ఇంకెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

పిలిచి గుత్తేదారులకు మేలు చేసే విధానాలను ఇంకా వీరు మరవడం లేదు.

అనుమతులిచ్చారు.. : జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర జాతీయ పండుగగా గుర్తింపు పొందింది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి కోటిమందికి పైగా భక్తులు వస్తారు. జాతర ప్రారంభం కావడానికి ఇంకా ఐదు నెలల గడువే ఉంది. గతేడాది డిసెంబర్ 28, ఈఏడు జనవరి 28 తేదీల్లో మేడారం జాతరపైనే అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ మురళి భూపాలపల్లిలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జాతరను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. 20 శాఖలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు తయారుచేశారు. కనీసం ఆరు నెలల ముందు నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో రూ.147.37 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించింది. జిల్లాకు చెందిన స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌తో మాట్లారు. మే నెలాఖరున ముఖ్యశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సుమారు రూ.100 కోట్లు మంజూరు చేశారు.

టెండర్ ప్రక్రియ.. పనులు పూర్తి చేయడం సులువు కాదు: ఏదైనా అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేస్తుంది. మేడారం జాతర విషయానికొస్తే ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి.. కానీ ఇంకా జీవో జారీ కాలేదు. జీవో వచ్చాక అధికారులు టెండర్లు పిలిచి.. గుత్తేదారులతో పనుల ఒప్పందాలు చేసుకోవడం.. తదితర పనులకు చాలా సమయం పడుతుంది. కొన్ని పనులకైతే రెండు నెలల సమయం కూడా పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు ఆర్అండ్‌బీ తరపున ఏదైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలంటే గుత్తేదారుకు కనీసం 6 నెలల వ్యవధి ఇస్తారు. కొంచెం పెద్ద పని అయితే ఏడాది, 18 నెలల గడువు కూడా ఉంటుంది. ముందుగా ఆన్‌లైన్‌లో టెండర్ పిలిస్తే 21 రోజుల గడువు ఉంటుంది. ఆ తర్వాత టెండర్లు విప్పి గుత్తేదారుల అర్హతను అధికారులు పరిశీలిస్తారు. టెండర్లు వేసిన గుత్తేదారులలో స్వచ్ఛందంగా తప్పుకోవడానికి మరో వారం రోజుల సమయం ఇస్తారు. అనంతరం టెండర్లను పరిశీలించి గుత్తేదారు నియామకం జరుగుతుంది. పనిని బట్టి 3, 6, 12, 18 నెలల వ్యవధి ఇస్తూ పని ఒప్పందం చేసుకుంటారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఐబీ, ఐటీడీఏలలోని ప్రతి ఇంజినీరింగ్ శాఖ పద్ధతి ఇలాగే ఉంటుంది. పనుల వారీగా మైల్‌స్టోన్స్ కూడా ఇస్తారు. మేడారం జాతర విషయానికొస్తే రోడ్లు, భవనాల శాఖే అత్యధికంగా రూ.75 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. ఈ శాఖ తరపున ఇప్పుడు పనులు ప్రారంభిస్తే 2018 జనవరి 31 జరిగే జాతర సమయానికి కూడా పూర్తిచేయడం కష్టమే. మరి అలాంటిది... ఇప్పటివరకు ఇంకా టెండర్ ప్రక్రియే పూర్తికాలేదు. పనులు మొదలుపెట్టేది ఎప్పుడో జిల్లా అధికారులకే తెలియాలి.

గతంలో ఇలా జరిగేది..: మేడారం జాతర అభివృద్ధి పనుల విషయంలో హడావుడి పనులు ఎక్కువగా జరిగేవి. జాతరకు మూడు, నాలుగు నెలల ముందు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. అధికారులు వారం రోజుల్లో పూర్తయ్యే షార్ట్‌టెంటర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకునేవారు. గుత్తేదారులు కూడా చాలా ఆలస్యంగా పనులు మొదలుపెట్టేవారు. పనులు చాలా నాసిరకంగా జరిగేవి. ఓవైపు భక్తులు జాతరకొస్తేంటే..మరోవైపు అభివృద్ధి పనులు జరిగేవి. జాతర ముగిసాక కొద్ది నెలలకు పనుల జాడ కన్పించేది కాదు. దశాబ్దాల పాటు సేవలందించేలా చేపట్టాల్సిన పనులు రెండేళ్ల జాతరకొచ్చే సమయానికి ఆనవాళ్లు కన్పించేవి కావు. ఇలా చేసిన పనినే మళ్లీ, మళ్లీ చేయడానికి అధికారులు ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు చేయించుకోవడం పరిపాటిగా మారిపోయింది.

పరిపాలన అనుమతులకోసం పంపించాం

–ఆకునూరి మురళి, జయశంకర్ జిల్లా కలెక్టర్

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకుంటాం. గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

“కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందనే” అనే చందంగా తయారైంది కాకతీయ విశ్వవిద్యాలయంలోని పలు కోర్సుల పరిస్థితి. ఉన్నత విద్యారంగంలో ఉత్తమ ప్రమాణాలను పాటించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ మానవ నిర్వహణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థలు రూపొందించిన కఠిన నిబంధనలు పలు కోర్సులను కనుమరుగు చేస్తున్నాయి. డిస్టెంట్ ఎడ్యూకేషన్ బ్యూరో (డెబ్), జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) వారు అమలు చేస్తున్న నిబంధనలతో కేయూ అందిస్తున్న కోర్సుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనలు సంస్కరించే విధంగా ఉండాలి. కానీ కోర్సులకు ఎసరు తెచ్చేవిధంగా ఉంటే అసలుకే మోసం వస్తుందని కేయూ అధ్యాపకవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గుదిబండలా మారిన కఠిన నిబంధనలతో ఎన్ని కోర్సులు ఊడాయి? అధికారుల వైఖరేంటి? భవిష్యత్తులో ఈ కోర్సులను పునరుద్ధరిస్తారా? అనే అంశాలపై ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం.



కఠిన నిబంధనలు...

కనుమరుగవుతున్న కోర్సులు

– న్యూస్‌టుడే, కేయూ క్యాంపస్

● భవిష్యత్తులో పునరుద్ధరణ సందేహమే?

● నష్టపోతున్న విద్యార్థులు

గ్రామీణ విశ్వవిద్యాలయంగా పేరొందిన కాకతీయకు నిబంధనలు కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ప్రవేశాలు తగ్గి విద్యార్థులకు నష్టం కల్గించడంతోపాటు అటు విశ్వవిద్యాలయం, ఇటు దూరవిద్యకేంద్రం ఆదాయానికి గండికొడుతున్నాయి. విశ్వవిద్యాలయాల పరిపుష్టికి తగినన్ని నిధులు ఇవ్వడంపైన ప్రభుత్వం శ్రద్ధ కనబరచకపోవడంతో అవి అంతర్గత వనరులపైన దృష్టి కేంద్రీకరించాయి. ఇందుకోసం డిమాండ్ ఉన్న కోర్సుల నిర్వహణకు ప్రణాళికలు రచిస్తున్నాయి. అధికంగా ఆర్థిక వనరులను సమకూర్చే దూరవిద్య కేంద్రంలో కొత్త కోర్సుల రూపకల్పనకు నిర్వాహకులు కృషి చేస్తుండగా అన్ని అడ్డంకులే ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించడానికి కృషి చేయాల్సిన కేయూ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పలు కోర్సుల్లో ప్రవేశాలు నిలిచిపోయాయి.

ఉపాధ్యాయ విద్య కోర్సుల్లో..

● కేయూ పరిధిలోని వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మొత్తం 52 విద్యా కళాశాలలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం వరకు ఈ కళాశాలల్లో 100 చొప్పున బీఈడీ సీట్లు అందుబాటులో ఉండేవి. మొత్తంగా 5200 సీట్లు ఉండేవన్న మాట. బీఈడీ కోర్సును రెండేళ్ల కోర్సుగా మార్చిన తర్వాత ఈ సీట్లు తగ్గుతూ వస్తున్నాయి. గతేడాది నుంచి దాదాపు అన్ని కళాశాలల్లో కేవలం 50 సీట్ల చొప్పున మాత్రమే ఉన్నాయి. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేవని, అధ్యాపకులు లేరని సీట్లు తగ్గించారు. కేయూ పరిధిలోని అన్ని జిల్లాల్లో 2 వేలకుపైగా సీట్లు తగ్గాయి. విద్యార్థులకు నష్టం కలుగుతుండటంతోపాటు ఆదాయం తగ్గింది.

● ఎంఈడీ పరిస్థితి దారుణంగా ఉంది. 2014-2015 వరకు కేయూ పరిధిలోని నాలుగు కళాశాలల్లో 200 సీట్లు అందుబాటులో ఉండేవి. జనగామలోని ఏకశిల, వరంగల్‌లో ఎల్‌బీ, ఖమ్మంలోని బ్రౌన్స్, కేయూ క్యాంపస్‌లోని విద్యాకళాశాలల్లో 50 చొప్పున ఎంఈడీ సీట్లు ఉండేవి. ఈ సీట్లను భర్తీ చేయడానికి కేయూ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. 200 సీట్ల కోసం 4 వేల మంది పోటీపడేవారు. గత విద్యాసంవత్సరం నుంచి మూడు కళాశాలల్లో ఎంఈడీ కోర్సు నిర్వహణకు కేయూ అధికారులు అనుమతి ఇవ్వడంలేదు. ఎన్‌సీఈటీ నిబంధనల ప్రకారం కళాశాలల్లో సౌకర్యాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, అధ్యాపకులు లేరని అనుమితివ్వలేదు. కేవలం కేయూ విద్యా కళాశాలలో మాత్రమే 50 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం అధికంగా విద్యార్థులు పోటీపడుతున్నారు. ప్రతి కళాశాలలో ఎంఈడీ నిర్వహణకు ఇద్దరు ఆచార్యులు, ఇద్దరు సహాయ ఆచార్యులు, ఆరుగురు సహ ఆచార్యులు ఉండాలని ఎన్‌సీటీఈ నిబంధనలు చెబుతున్నాయి. వీటి ప్రకారం అధ్యాపకులు లేరని చెపుతూ అనుమతి ఇవ్వని అధికారులు అదే సూత్రాన్ని మినహాయించి కేయూకు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేయూలో ఎంఈడీ నిర్వహణకు 10 మంది అధ్యాపకులు అవసరముండగా ప్రస్తుతం ఒక ఆచార్యుడు, ఒక సహ ఆచార్యురాలు మాత్రమే ఉన్నారు. ఇక బీఈడీలో వంద సీట్లు ఉండగా ఇందులో అందరూ ఒప్పంద అధ్యాపకులే ఉన్నారు.

నిబంధనల అమలులో వివక్షత

నిబంధనలు అమలు చేయడంలో కేయూ అధికారులు వివక్షను ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయం కాబట్టి ఎన్‌సీఈటీ నిబంధనలు అవసరంలేదని అధికారులంటున్నారు. కానీ కేయూ దూరవిద్య కేంద్రానికి వర్తిస్తాయనడం దారుణమని కొందరు చెబుతున్నారు. దూరవిద్య కేంద్రం నిర్వాహకులు కోర్సులకు అనుమతి తీసుకురావడంలో చేస్తున్న కృషి అభినందనీయమని విద్యార్థులు అంటున్నారు. వీరికితోడు కేయూ ఉన్నతాధికారులు నిబంధనల సడలింపు కోసం కేంద్ర సంస్థలతో మాట్లాడితే సత్ఫలితాలు ఉంటాయని వారంటున్నారు. సాయన్న బాధ్యతలు చేపట్టిన తరువాత కేయూలోని, దూరవిద్య కేంద్రంలోని డిమాండ్ ఉన్న కోర్సులు కనుమరుగుకావడం ఆయన పాలనపైన ప్రభావాన్ని చూపుతున్నాయని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. ఆయన చొరవ చూపి కోర్సుల పునరుద్ధరణకు కృషి చేయాలని, లేదంటే ఆర్థిక వనరుల కొరత తీవ్రతరమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

రెగ్యులర్ విద్యలో..

గతంలో బీఈడీ సీట్లు **5200**
ప్రస్తుతం **2 వేలు**
ఎంఈడీ సీట్ల సంఖ్య **200**
ప్రస్తుతం **50**

దూరవిద్యలో..

కోల్పోయిన బీఈడీ సీట్లు **500**
ఎంఈడీలో **250**
గతంలో అధ్యయన కేంద్రాల సంఖ్య **170**
ప్రస్తుతం **70**
ఐదేళ్ల కిందట డిగ్రీ ప్రవేశ పరీక్ష రాసే వారి సంఖ్య **30 వేలు**
గతేడాది **3 వేలు**

దూర విద్య కేంద్రంలో...



డెబ్ కఠిన నిబంధనలు, కేయూ అధికారుల ఉదాసీనత ఫలితంగా దూరవిద్య కేంద్రంలోని పలు కోర్సుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. డెబ్ అనుమతి లేదని గత విద్యాసంవత్సరానికిగాను పలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించలేదు. ఎంఏ తెలుగు, గణితం, ఎంఎస్‌డబ్ల్యూ, గ్రంథాలయం, జర్నలిజంలాంటి డిమాండ్ ఉన్న కోర్సులకు అనుమతించలేదు. ఇప్పటికీ రెండేళ్ల కిందట వరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అందిస్తున్న బీఈడీ, ఎంఈడీ కోర్సులకు కూడా అనుమతి లభించలేదు. ఫలితంగా బీఈడీలో 500, ఎంఈడీలో 250 సీట్లు కనుమరుగయ్యాయి. పదోన్నతుల కోసం బీఈడీ, ఎంఈడీ చేయాలనే ఉపాధ్యాయులకు నిరాశ మిగులుతుంది. ఇక ఈ కేంద్రం రెండేళ్ల వరకు దేశంలోని పలు ప్రాంతాల్లో అధ్యాయన కేంద్రాలను నిర్వహించేది. డిగ్రీ, పీజీ కోర్సులతోపాటు డిప్లొమా కోర్సులను అందించేది. గతంలో 170 కేంద్రాలుండగా ప్రస్తుతం 70కి చేరుకుంది. గతేడాది నుంచి కేవలం తెలంగాణ ప్రాంతంలో మాత్రమే అధ్యయన కేంద్రాలను అనుమతి ఇవ్వడంతో పరిస్థితి ఆందోళన కల్గిస్తుంది. డిగ్రీ ప్రవేశ అర్హత పరీక్షకు గతంలో 30 వేల మంది వరకు పరీక్షలు రాయగా గత విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షకు కేవలం 3 వేల మంది మాత్రమే హాజరయ్యారు. ఇవే పరిస్థితులు కొనసాగితే కేయూకు ఆర్థిక వనరులను సమకూర్చిపెట్టే దూరవిద్య కేంద్రం సంక్షోభంలో పడటం ఖాయమని అధ్యాపక, ఉద్యోగవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న జగన్‌మోహన్

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే : పంటల సాగులో కీలకమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్. ఎం. జగన్‌మోహన్ డీలర్లకు సూచించారు. ఆదివారం హన్మకొండలోని వ్యవసాయ శాఖ రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డీలర్లకు ఇస్తున్న డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ కోర్సు శిక్షణ కార్యక్రమంలో జగన్‌మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విత్తనాలలో నాణ్యత లోపంతో ఏటా రైతులకు నష్టం జరుగుతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. డీలర్లకు అవగాహన లేకపోవడంతోనే మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పంటల సాగులో సమస్యలు ఏర్పడితే వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సిఫారసుల మేరకు పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే ప్రతి డీలరు తప్పకుండా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ కోర్సు పూర్తి చేయాలనే నిబంధనను విధించినట్లు తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మాత్రమే దుకాణాలను నిర్వహించేందుకు అర్హులన్నారు. ఈ కోర్సులో ప్రతి డీలరు చేరాలని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయశాఖ ద్వారా జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అయిదు జిల్లాల వ్యవసాయాధికారులు ఉషాదయాల్, అనూరాధ, శత్రునాయక్, వీరునాయక్, వరంగల్ ఏడీఏ కృష్ణారెడ్డి, ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్, శిక్షణ పొందుతున్న డీలర్లు పాల్గొన్నారు.

26 నుంచి కేయూ బీఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం వారు అందిస్తున్న బీఫార్మసీ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. మహేందర్‌రెడ్డి, అదనపు అధికారి ఆచార్య వి. రామచంద్రంలు ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 28, 30, వచ్చే నెల 1, 4, 6 తేదీల్లో పరీక్షలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల నుంచి హాల్‌టికెట్లను పొందవచ్చునని అధికారులు స్పష్టం చేశారు.

ప్రశాంతంగా జూనియర్ సివిల్ జడ్జి ఎంపిక ప్రాథమిక పరీక్ష

సుబేదారి, న్యూస్‌టుడే: వరంగల్ అర్బన్ జిల్లా సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ సివిల్ జడ్జి ఎంపిక కోసం ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. ఎస్ రామచంద్రమూర్తి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలు చేసి డీసీపీ వేణుగోపాల్‌రావు పర్యవేక్షించారు. పరీక్ష రాసేందుకు 567 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 106 మంది హాజరుకాలేదు. 461 మంది పరీక్ష రాశారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య



మాట్లాడుతున్న కృష్ణయ్య

బాలసముద్రం, న్యూస్‌టుడే : ఓబీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ర్యాగ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఓబీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం వరంగల్ డివిజనల్ సర్వసభ్య సమావేశం బాలసముద్రంలోని ఎల్ఐసీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని అసోసియేషన్ బాధ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతీయ నేత కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. రాజ్యాంగం సవరించి పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని గతంలో ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని కలిసి సమస్యలు వివరించామన్నారు. ఆ తర్వాత ఉద్యోగులు ఎంతమంది ఉన్నారనే గణాంకాలు బయటకు తీసి పార్లమెంట్‌లో చర్చకు తెస్తే సభ్యులు మద్దతు ఇవ్వలేదన్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్ నిలిచిపోయిందని తెలిపారు. ఇక్కడితో నిరాశ చెందకుండా హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలన్నారు. రిజర్వేషన్ అమలులో ఉన్నప్పటికీ అందుకు తగ్గ ఉద్యోగాలను భర్తీ చేయడంలేదన్నారు. దేశంలో 14 లక్షల ఉద్యోగాలు పలు శాఖల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. విద్యతోనే బీసీలు అభివృద్ధి చెందుతారనే ఉద్దేశంతో అనేక పోరాటాలు చేసి సాధించుకున్నామని తెలిపారు. రిజర్వేషన్లు, పదోన్నతుల్లో ఎవరికి ఎలాంటి సమస్యలు తలెత్తినా తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్‌ఎల్‌కే. ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడిగా కె. సురేందర్, ప్రధాన కార్యదర్శిగా సోమేశ్వరయ్య, కోశాధికారిగా లక్ష్మిపతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్, బీసీ సంఘాల నేతలు అజయ్‌కుమార్, స్వామినాథన్, అశోక్, కోలా జనార్దన్‌గౌడ్, యాదగిరి, బొనగాని యాదగిరిగౌడ్, బుట్టి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

ఏటూరునాగారం: శ్రీ వెంటేశ్వరటాకీస్: లై
పస్రా: శ్రీమెహర్‌రంగ మహల్: లై
ములుగు: తిరుమల కళామందిర్: లై

ములుగు

పరామర్శ

ములుగు రూరల్,న్యూస్‌టుడే: మండలంలోని కొడిశలకుంట గ్రామానికి చెందిన కొల్లేటి వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం తెదేపా మండలాధ్యక్షుడు పల్లె జయ పాల్‌రెడ్డి, పలువురు నాయకులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.

పాలక మండలి ఎన్నికను రద్దు చేయాలి

మల్లూరు(మంగపేట),న్యూస్‌టుడే: మల్లూరు దేవస్థాన పాలక మండలి ఎన్నికను రద్దు చేయాలని పీసా కమిటీ ఉపాధ్యక్షులు నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, కార్యదర్శి పూసం శ్రావణ్‌కుమార్, మొబలైజర్ సోడె భూపతి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. మండలంలోని మల్లూరు గుట్టపై వెలసిన శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి పాలక మండలి ఎన్నికలు నిర్వహించడం పంచాయతీరాజ్ పీసా చట్టం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు ఏకమై నిర్వహించిన ఈ ఎన్నికను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆలయ కమిటీ డైరెక్టర్‌గా రమేష్

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: మంగపేట మండలం మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి డైరెక్టర్‌గా ఏటూరునాగారానికి చెందిన స్టార్ యువజన సంఘం అధ్యక్షుడు పర్వతాల రమేష్ నియమితులయ్యారు. మండలం నుంచి రమేష్‌కు ప్రాతినిధ్యం కల్పించినందుకు మిత్రులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.

'ఏకీకృత సర్వీస్ నిబంధనల అమలుకు ఉద్యమించండి'

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు వర్తింపజేయాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొప్ప వీరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. పదోన్నతుల్లో ఐటీడీఏ ఉపాధ్యాయులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పదో పీఆర్సీ ప్రకారం సీఆర్టీలకు వేతనాలు చెల్లించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, గురుకుల పాఠశాలల్లో పనిచేసే సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలుకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఈనెల 28న ఐటీడీఏ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జయేందర్‌రావు, సీహెచ్ నారాయణ, కొర్నిబెల్లి రాఘవరావు, లక్ష్మీనారాయణ, కొప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల నియామకాన్ని రద్దు చేయాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: 2012 ఏజెన్సీ డీఎస్సీలో నియామకమైన 8 మంది అభ్యర్థుల నియామకాలను రద్దు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు పొడెం శోభన్, రాష్ట్ర నేత కోరగట్ల లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. ఎనిమిది మంది అభ్యర్థులు మైదాన ప్రాంతానికి చెందిన వారని ఐటీడీఏ అధికారులు వారికి తొత్తులుగా వ్యవహరించి ఏజెన్సీయేతర అభ్యర్థులను నియమించారని ధ్వజమెత్తారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బోరునర్సాపురం(మంగపేట),న్యూస్‌టుడే: మండలంలోని బోరునర్సాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తినేని ప్రశాంత్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. మండలంలోని చెరుపల్లికి చెందిన ప్రశాంత్ కొంత కాలంగా అత్తగారి ఊరు మల్లూరులో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై మంగపేటకు వచ్చాడు. పనిముగించుకున్న అనంతరం తిరిగి రాత్రి తన అత్తగారి ఊరు మల్లూరుకు వెళ్తున్నాడు. బోరునర్సాపురం వద్ద అదే గ్రామానికి చెందిన ఓ రైతు రోటోవేటర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ప్రశాంత్ కిందపడి పోయాడు. ఈ సంఘటనలో ప్రశాంత్ కుడిచేయి, కుడికాలు నుజ్జునుజ్జు కాగా ఎడమకాలు, ఛాతీకి తీవ్ర గాయాలయ్యాయి. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్కు లేకపోవడం, 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో తీవ్ర గాయాలైన ప్రశాంత్ అర్ధగంట వరకు రోడ్డుపైనే పడి ఉన్నాడు. ప్రైవేటు వాహనాలు ఎవరూ ఆపక పోవడంతో మంగపేటకు చెందిన రహిమతుల్లా అనే వికలాంగుడు స్పందించి సంఘటనా స్థలానికి వచ్చి ఆటోలో ప్రశాంత్‌ను ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెరువులకు జలకళ

- ఊపందుకున్న వరినాట్లు
- పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు

ములుగు, న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ములుగు ప్రాంతంలో ఎక్కడ చూసినా వరినాట్ల జోరు కనిపిస్తోంది. ములుగు నియోజకవర్గంలో నిన్నమొన్నటి వరకు పంటపొలాలన్నీ వెలవెలబోయాయి. వరి నార్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. కాలం గడిచిపోవడంతో పోసిన వరినాట్లు ఇక పనికిరావేమోనని అనుకున్న పరిస్థితుల్లో అకస్మాత్తుగా ఊహించని రీతిలో కురిసిన వర్షాలు రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఇంతవరకు పత్తి, మిరప పంటలకు మాత్రమే అనుకూలమనుకున్న పరిస్థితులను అధిగమించి వరి పంటకు కూడా అనుకూలంగానే మారింది. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 50,304 హెక్టార్లలో వరి, పత్తి, మిరప పంటలు పండించాలని వ్యవసాయ అధికారులు ఖరీఫ్ ప్రణాళికను రూపొందించారు. ఐతే అనుకున్న విధంగా పత్తి పంట మాత్రం బాగానే వేశారు. పంట కూడా ఆశించిన రీతిలో ఎదుగుతోంది. కాని వరి పంట ఇంత వరకు అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోయింది. మిరప పంటను రైతులు ఇప్పుడిప్పుడే నాటే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలో వరి పంట 31,175 హెక్టార్ల లక్ష్యం కాగా వారం రోజుల్లో అనుకున్న లక్ష్యం పూర్తవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్ల జోరు ఊపందుకుంది. పల్లె వాసులంతా పంట పొలాల బాట పట్టారు. అనుకున్న విధంగానే 14,497 హెక్టార్లలో పత్తి పంట ఇప్పటికే సాగవుతోంది. 4632 హెక్టార్లలో మిరప పంట వేయాల్సి ఉంది. ఆశాజనకంగా కురిసిన వర్షాలతో పంటలు ఆశించిన మేర పండే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కొనసాగుతున్న వాగుల జోరు..

వాగుల్లో వరద ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. శనివారం పూర్తిస్థాయిలో రవాణా స్తంభించగా ఆదివారం కొద్ది కొద్దిగా రాకపోకలు సుగమమయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లకు గండ్లు పడడంతో ఇంకా రాకపోకలు ప్రారంభం కాలేదు. గండ్ల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. పత్తి చేలల్లో నీళ్లు నిలిచాయి. ములుగు నుంచి అంకన్నగూడెం మార్గంలో రెండు ప్రదేశాల్లో శనివారం కురిసిన వర్షాలతో వరద ఉద్ధృతికి పంచోత్కులపల్లి, దుబ్బగూడెంల వద్ద రెండు ప్రదేశాల్లో రోడ్లు గండ్లు పడి పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిచిపోయాయి.

చెరువులు, కుంటల్లో జలకళ..

రెండు రోజులపాటు కురిసిన వర్షాలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపాయి. నిన్నటి వరకు వెలవెలబోయిన చెరువులు, కుంటలు జలకలతో కలకళలాడుతూ నిండుకుండలా కనిపిస్తున్నాయి. రామప్ప లాంటి మధ్యతరహా నీటివనరుల్లోకి కూడా ఆశాజనకంగా వరద నీరు ప్రవహిస్తోంది. అధిక వర్షాలతో వాగులు ఉప్పొంగుతుండడంతో పలువురు ఉత్సాహంగా చేపలు పడుతున్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: వర్షం కారణంగా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని వైస్ ఎంపీపీ దేవరనేని స్వామిరావు డిమాండ్ చేశారు. మండలంలోని సర్వాపురం, పంచోత్కుపల్లి, రాయినిగూడెం, దుబ్బగూడెం, కొత్తూరు తదితర గ్రామాలలో ఆదివారం పర్యటించి వరద కారణంగా దెబ్బతిన్న పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి వేసిన పంటలు వరద కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా సర్వే చేపట్టాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో రవాణ వ్యవస్థ స్థంబించిపోయిందని, అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ శ్రీను, రైతులు ఉన్నారు.

వర్షంతో అతలాకుతలమైన గ్రామాలు

ములుగు రూరల్,న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని గ్రామాలు అతలాకుతలమయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రహదారి వెంటనున్న కల్వర్టులు దెబ్బతిన్నాయి. దుబ్బగూడెం-రాయినిగూడెం గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వరద నీటికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆదివారం దుబ్బగూడెం, సర్వాపురం, రాయినిగూడెం, కొత్తూరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగు వరద ప్రవాహం కొనసాగుతుంది. ఫలితంగా సర్వాపురం, జగ్గన్నగూడెం, లాలాయిగూడెం, అంకన్నగూడెం గ్రామాలకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి. వివిధ పనుల నిమిత్తం ములుగుకు వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాయినిగూడెం ఎంపీటీసీ లింగంపల్లి సంపత్‌రావు, కాసిందేవిపేట ఎంపీటీసీ దేవరనేని స్వామిరావులు, కొత్తూరు ఉప సర్పంచి రవీందర్ పలు గ్రామాలను సందర్శించారు. కల్వర్టులు, బొగ్గులవాగు వద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అదేవిధంగా దెబ్బతిన్న రహదారులకు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు పీఆర్ అధికారులను పిలిపించారు. పీఆర్ డీఈ ఇంజిగిరి, ఏఈ ధర్మేందర్ కల్వర్టులను, రహదారులను పరిశీలించారు. రాకపోకలు సాగించేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లుచేసి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి శాశ్వత పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

రైతుల ఆశలకు ఆటంకాలు

వెంకటాపూర్,న్యూస్‌టుడే: మండలంలో కురిసిన భారీ వర్షానికి చిన్నచిన్న చెరువులు, కుంటలు నిండి అలుగులుపోశాయి. ఇప్పటికే వరిపంట వేసుకున్న రైతుల ఆశలకు ఆటంకాలు ఎదురయ్యాయి. వెంకటాపూర్ సమీపంలోని వీరప్ప కుంటకు గండిపడడంతోపాటు మత్తడి తీవ్రస్థాయిలో పోయడంతో ఆయకట్టు పరిధిలోని పంట పొలాలవైపు వరదనీరు వెళ్లింది. దీంతో కాలువలకు, వరిమడులకు గండ్లు పడ్డాయి. వరిపైరుపై ఇసుక మేటలు పెట్టింది. ఆదివారం రైతులు పంట పొలాలకు చేరి గండ్లు పూడ్చారు. ఇసుకమేటలను చదును చేస్తూ కొట్టుకుపోయిన వరినాట్ల స్థానంలో మళ్లీ నాట్లు వేశారు. రామప్ప చెరువు రెండోతూము (టైగర్‌జోన్) వద్ద ఉన్న చింతచెట్టు పడిపోయింది. చెరువు నీరు తూముకు వచ్చే కాలువలో చెట్టు పడిపోవడంతో తూములోకి నీరురాకుండా ఆగిపోయాయి. ఐబీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు నీటికొరత వల్ల


వరినాట్లు వేస్తున్న దృశ్యం


నిండిన తోపుకుంట చెరువు


దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న స్వామిరావు


నాట్లు వేయలేకపోయిన రైతులకు కొంత ఊరటనిచ్చింది. ఉత్సాహంగా ఆదివారం రైతులు వరినాట్లు వేశారు.


రామప్పలో 23 అడుగులకు చేరిన నీటిమట్టం...

వెంకటాపూర్,న్యూస్‌టుడే: రెండు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షానికి రామప్ప చెరువులోకి ఆదివారం సాయంత్రానికి 23 అడుగులకు నీరు చేరింది. గతంలో 17 అడుగుల నీరు కలిగిన రామప్ప చెరువులోకి ఎగువ ప్రాంతంలోని వరద నీరు చేరడంతో 6 అడుగుల నీరు వచ్చింది. 35 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన రామప్పలోకి ఇంకా 12 అడుగుల నీరు చేరితేనే జలకళ సంతరించుకుంటుంది. ప్రస్తుతం వచ్చిన నీటితో రామప్ప కట్ట పరిధిలో అధికారికంగా 5500 ఎకరాల పంటలకు సాగు నీరు అందించే నీరు చేరింది. దాంతో ఆయకట్టు రైతులు ఆనందంతో ఉన్నారు.


ఉద్ధృతంగా ప్రవహిస్తున్న యాసంగి వాగు

తాడ్వాయి,న్యూస్‌టుడే: మండలంలోని వెంగళాపురం సమీపంలోని యాసంగి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. రెండు రోజులుగా ఎగువప్రాంతంలో కురిసిన వర్షాలకు వరదనీరు భారీగా చేరి ఆదివారం ఒక్కసారిగా ప్రవాహం పెరిగింది. దీంతో పస్రా-మేడారం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసరమున్న ప్రయాణికులను స్థానిక యువకులు వాగును దాటించారు.


కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు



రామప్ప సరస్సు


రామప్ప టైగర్‌జోన్ తూములోకి వచ్చే నీటి కాల్వకు అడ్డంగా పడిన చింతచెట్టు

ములుగు

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

కన్నాయిగూడెం,న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉండాలని బుట్టాయిగూడెం చైతన్య యువజన సంఘం సభ్యులు కోరారు. ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటలకే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మూసివేస్తున్నారని దీంతో వైద్యం కోసం వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇటీవల బుట్టాయిగూడేనికి చెందిన ఓ వివాహిత పాము కాటుకు గురి కాగా వైద్యం కోసం ప్రాథమిక కేంద్రానికి రాగా తాళం వేసి వుందని, దీంతో ముప్పై కిలోమీటర్ల దూరంలోని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ నిర్వహణ కమిటీలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఏఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరాత్రి సంబరాల్లో ఎలాంటి అల్లర్లకు తావివ్వకూడదని తెలిపారు. మైక్‌సెట్ వాడకానికి పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలు వాడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సివస్తుందన్నారు. ఉత్సవ కమిటీల వారు తమ ఉత్సవ వివరాల గురించి పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా బోనాల పండుగ

గాంధీనగర్(మంగపేట),న్యూస్‌టుడే: మండలంలోని గాంధీనగర్, మంగపేటతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటివద్ద బోనం తయారు చేసి ముత్యాలమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. గాంధీనగర్ గ్రామస్థులు లక్ష్మీదేవర కొలుపులు నిర్వహించి బొడ్రాయి, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

ములుగు, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ములుగులోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కోసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాన్ని సుభిక్షంగా పరిపాలించిన ఘనత రాజీవ్‌గాంధీదని కొనియాడారు. కార్యక్రమంలో ఎండి యూనస్, వేములపెల్లి భిక్షపతి, ఇమ్మడి రాజు, చెన్న కిషోర్, దూడబోయిన శ్రీనివాస్, మహేందర్, కాకి పురుషోత్తం, కొడెపాక మహేందర్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

అవార్డుతో అరుదైన గుర్తింపు

ములుగు, న్యూస్‌టుడే: రాష్ట్ర గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌లెన్సీ అవార్డు బహుకరించడమనేది అరుదైన గుర్తింపని స్వేరోస్ మండలాధ్యక్షుడు హట్కర్ సూర్యకిరణ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గురుకులాలను కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తూ విద్యా, వైద్య, క్రీడా రంగాలలో అత్యంత ప్రతిభావంతులుగా ప్రవీణ్ కుమార్ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవిందర్, కిరణ్, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆరోగ్యం కోసం చర్చిలో ప్రార్థనలు

మంగపేట,న్యూస్‌టుడే: గిరిజన శాఖ మంత్రి ఆజ్మీర చందూలాల్ ఆరోగ్యం కుదుట పడాలని మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్‌లోని ఓఫీర్ మినిస్ట్రీస్ అగాపే ఫుల్ గాస్పల్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని కోమటిపల్లికి చెందిన తెరాస నాయకులు కాసర్ల మల్లారెడ్డి, కలమ్మ, క్రైస్తవ సంఘం పెద్దల ఆధ్వర్యంలో మంగపేట, కోమటిపల్లి, గంపోని గూడెం, బోరు నర్సాపురం, పొద్మూరుకు చెందిన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ దేవరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగా ఉన్న చందూలాల్ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారన్నారు. ఆయన త్వరగా కోలుకొని మండల ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ సోదురులు బోరింగ్ మల్లారెడ్డి, కలమ్మ, ద్రోణాచారి, కృష్ణ, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకమే నిజమైంది : ఐబీ ఈఈ

లక్నవరం జలాశయం,(గోవిందరావుపేట),న్యూస్‌టుడే: అన్నదాతల ఆశలకు ప్రతిరూపంగా నిలుస్తున్న లక్నవరం జలాశయం విషయంలో తమ నమ్మకమే నిజమైందని నీటిపారుదల శాఖ ఈఈ రవీందర్ చెప్పారు. లక్నవరం జలాశయం ఆదివారం నుంచి మత్తడి పోస్తుండడంతో రవీందర్‌తో పాటు డీఈఈ యశ్వంత్, ఏఈ సుధీర్‌తో కలిసి జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో లక్నవరం జలాశయం నీటి మట్టం 25 అడుగులకు చేరుకొన్న తరుణంలో వర్షాలు ముఖం చాటేశాయన్నారు. ఈ నేపథ్యంలో జలాశయం ఆయకట్టు రైతులు వచ్చి తమను కలిసి తమ బాధలు చెప్పుకొన్నారన్నారు. నిబంధనల ప్రకారం జలాశయంలోని నీరు విడిచిపెట్టే అవకాశం లేకపోయినప్పటికీ మంత్రి అజ్మీరా చందూలాల్ సూచనలను పరిగణలోకి తీసుకొని ఎట్టకేలకు సాహసంచేసి నీరు విడుదల చేశామన్నారు. మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర సంవత్సరం నాటికి జలాశయం మత్తడి పోస్తుందని ఇక్కడి అధికారులు, రైతులు చెప్పడంతో ఆ నమ్మకంతోనే ధైర్యం చేసి నీటి విడుదలకు అనుమతి ఇచ్చామన్నారు. వరి నాట్లు పూర్తయ్యేసరికి నీటి మట్టం 23.5 అడుగులకు తగ్గిందన్నారు. మళ్లీ ఇటీవల కురిసిన చెదురుమదురు వర్షాలకు నీటి మట్టం 25 అడుగులకు చేరుకోవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నామన్నారు. ఇప్పుడు తమ నమ్మకాన్ని నిజం చేస్తూ జలాశయం మత్తడి పోస్తుండడంతో ఆనందంతో ఉన్నామన్నారు.

వర్షాలతో నిలిచిపోయిన దేవాదుల సొరంగం పనులు

ములుగు, న్యూస్‌టుడే: అనేక అవరోధాల మధ్య ప్రారంభమైన దేవాదుల ఎత్తిపోతల పథకం పనులకు అధిక వర్షాలు అడ్డు తగిలాయి. దేవాదుల ఎత్తిపోతల పనుల మూడో దశలో భాగంగా సుమారు రూ.10కోట్ల వ్యయంతో ప్యాకేజీ-1, ప్యాకేజీ-2, ప్యాకేజీ-3, ప్యాకేజీ-4 గా సొరంగం పనులను విభజించారు. మూడో దశ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు అప్పగించారు. ఇందులో భాగంగా గంగారం-భీంగణపురం, భీంగణపురం- రామప్ప, రామప్ప-ధర్మసాగర్, ధర్మసాగర్‌నుంచి అవతలికి ప్యాకేజీలుగా విభజించారు. ఒక్కో ప్యాకేజీకి ఒక్కో నిర్మాణ సంస్థ పనులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం రామప్ప నుంచి ధర్మసాగర్ వరకు గల మూడో ప్యాకేజీలో పనులు ప్రారంభమయ్యాయి. ప్యాకేజీ-3లో భాగంగా ములుగు మండలం ప్రభుత్వ డిగ్రీ సమీపంలోంచి సొరంగం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. జీరో ఆడిట్ పేరుతో మొదలైన పనులు ఊపందుకున్న తరుణంలో కురిసిన భారీ వర్షాలతో సొరంగంలోకి నీళ్లు చేరి పనులు ఆగిపోయాయి. పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాలువ నీరు అకస్మాత్తుగా వరదలాగా వచ్చి సొరంగంలోకి చేరాయి. సొరంగంలో పనులు నిర్వహిస్తున్న సీజర్స్ లిఫ్ట్ అనే యంత్రం అందులోనే కూరుకుపోయింది. అక్కడ పని చేసే సిబ్బంది యంత్రాన్ని తరలించే క్రమంలో వరదనీరు ఉద్ధృతంగా పరవళ్లు తొక్కుతూ వచ్చి సొరంగం నిండిపోయింది. సిబ్బంది అంతా పరుగులు పెట్టి సురక్షితంగా బయటపడ్డారు. సొరంగం పనులు నిర్వహిస్తున్న సమయంలో స్వతహాగా భూమిలోంచి ఊట నీరు వస్తుంది. ఆ ఊట నీటిని వెంటనే భారీ సామర్థ్యం కలిగిన విద్యుత్తు మోటార్ల ద్వారా తోడుతూ పనులకు ఆటంకం కలుగకుండా తవ్వకాలు నిర్వహిస్తుంటారు. తవ్వకాలు జరుపుతున్న సమయంలో శనివారం కురిసిన భారీ వర్షం ఊట నీటికి తోడై సొరంగం నిండిపోయింది. ప్యాకేజీ-3 లోని మరికొన్ని ఆడిట్‌పాయింట్ల వద్ద కూడా సొరంగాల్లోకి నీరు చేరింది. మిగిలిన ప్రదేశాల్లో నిలిచిన నీటిని తోడేందుకు సుమారు వారం రోజులు పట్టొచ్చని అంచనా. నీటిని తోడే సమయంలో మళ్లీ వర్షాలు పడితే నెల రోజుల వరకు ఇబ్బందికరంగానే ఉంటుందని నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పరవళ్లు తొక్కుతూ సొరంగంలోకి ప్రవేశిస్తున్న వరద నీరు

గురుకులంలోని సమస్యలు పరిష్కరించాలి

జాతీయ రహదారిపై విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా

ములుగు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని మల్లంపల్లి వద్ద కొనసాగుతున్న వెంకటాపురం, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన బీసీ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఆదివారం గురుకులం ఎదుట జాతీయ రహదారిపై గంటపాటు ధర్నా నిర్వహించారు. ధర్నాతో వాహనాలు పెద్దఎత్తున నిలవడంతో ములుగు ఎస్సై ఓదేల వెంకటేష్ ఆందోళనకారులకు నచ్చజేప్పే ప్రయత్నం చేసినా సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ధర్నాను విరమించేది లేదంటూ రహదారిపై బైఠాయించారు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన వాహనదారులు ఆందోళనకారులతో గొడవకు దిగారు. పరిస్థితి విషమిస్తుండటంతో అప్రమత్తమైన ఎస్సై సంబధిత అధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. సోమవారం గురుకులాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెప్పిన మాటాలను ఎస్సై విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గురుకులంలో విద్యార్థులకు దొడ్డు బియ్యంతో కూడిన ఉడికీ ఉడకని భోజనాన్ని పెడుతున్నారన్నారు. ప్రిన్సిపల్ గురుకులంలో విద్యార్థులను సక్రమంగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేవన్నారు. మొగుళ్ళపల్లి గురుకులానికి చెందిన విద్యార్థులకు ఇప్పటి వరకు పుస్తకాలు ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులు సైతం గురుకులానికి రావడం లేదని పేర్కొన్నారు. గబ్బిలాల సంచారంతో రాత్రి వేళల్లో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జిల్లా నుంచి శిక్షణకు ఒక్కరే సర్పంచి ...!

గోవిందరావుపేట,న్యూస్‌టుడే: 'పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం- ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు హైదరాబాద్ అపార్డ్‌లో నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి మండలంలోని చల్వాయి గ్రామ సర్పంచి తాటి రమణ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సర్పంచికి లేఖ పంపించారు. శిక్షణా కార్యక్రమానికి జిల్లా నుంచి రమణ ఒక్కరే ఎంపిక కావడం విశేషం. గతంలో దేశ రాజధాని దిల్లీలో నిర్వహించిన ఒక శిక్షణా కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రమణ ఒక్కడే ఎంపికయ్యారు. ఇటీవల జీవ వైవిధ్యానికి సంబంధించిన రాష్ట్రంలోని సిద్దిపేట, ముల్కనూరు. గజ్వేల్‌లో నిర్వహించిన సదస్సుకు ఈయన ఒక్కరే జిల్లా నుంచి ఎంపిక కావడం విశేషం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని రమణ తన పంచాయతీ పరిధిలో ఘనంగా నిర్వహించారు.

'మాదిగలను మోసం చేసిన భాజపా'

ములుగు, న్యూస్‌టుడే: వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి భాజపా ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందని తెలంగాణ మాదిగ ఐకాస జిల్లా అధ్యక్షుడు బోయిని సదయ్య అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలను మోసం చేసిన భాజపాకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. రాజ్‌కుమార్, రమేష్, రఘుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా హరీష్

వెంకటాపూర్,న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన గునిగంటి హరీష్‌ను టీజేఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తూ జాగృతి అభివృద్ధికోసం పాటు పడడం వల్లే జిల్లా కమిటీలో హరీష్‌కు స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు హరీష్ కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం

ములుగు, న్యూస్‌టుడే: తెలంగాణ జాగృతి నియోజక వర్గ మహిళా కన్వీనర్‌గా ములుగు మండలం జంగాలపల్లికి చెందిన గోల్కొండ రమ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏదుల సారక్క నియామక పత్రాన్ని రమకు అందించారు. జాగృతి మహిళా విభాగంలో విస్తృత సేవలు అందించినందుకుగాను ఈ పదవి అప్పగించినట్లు తెలిపారు.

టీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ములుగు రూరల్,న్యూస్‌టుడే: టీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇంచర్ల గ్రామంలో ఆదివారం గ్రామ కమిటీ అధ్యక్షుడు మోరె రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాబివృద్ధి కోసం మంత్రి చందూలాల్ ఇప్పటికే రూ.2.50 కోట్ల నిధులను కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంత్రి ప్రతిపాదనలు పంపారని పేర్కొన్నారు. అనంతరం గ్రామాభివృద్ధిపై ఆయన కార్యకర్తలతో సమీక్షించారు. సొసైటీ ద్వారా రైతులకు రుణాలు సక్రమంగా అందడం లేదని తక్షణమే రైతులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో ఎంపీటీసీ శానబోయిన అశోక్, కొట్టెపాక ప్రభాకర్, ఎల్లయ్య, లక్ష్మణ్, రమేష్, పరిపూర్ణచారి, వెంకటేష్, చేరాలు, నారాయణస్వామి, రఘుపతి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మేడారం(తాడ్వాయి),న్యూస్‌టుడే: మేడారం సమ్మక్క,సారలమ్మ దేవతలను భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజ సత్యవతి ఆదివారం దర్శించుకున్నారు. కటుంబ సమేతంగా మేడారం వచ్చిన ఆమె సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట భాజపా జిల్లా కార్యదర్శి ధర్మ, గోవిందరావుపేట జడ్పీటీసీ విజయలక్ష్మి, రవీందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి ఉన్నారు.

పత్తిపల్లిని సందర్శించిన డీఆర్‌వో

ములుగు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని పత్తిపల్లి గ్రామాన్ని ఆదివారం డీఆర్‌వో మోహన్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మి తన సొంత ఖర్చులతో మరుగుదొడ్డి నిర్మించుకున్న విషయాన్ని తెలుసుకొని ఆమెతో మాట్లాడారు. మరుగుదొడ్డికి అయిన ఖర్చుతో పాటు ప్రతీ నెలా లక్ష్మికి 30 కిలోల రేషన్ బియ్యం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం మీసేవ కేంద్రాన్ని ఎంపీపీ భూక్య మంజూలమురళీతో కలిసి ప్రారంభించారు. మొక్కలు నాటారు. సర్పంచి రజిత, గ్రామస్థుల పాల్గొన్నారు.

CLASSIFIEDS

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO ... BABY CARE CENTERS, IRON & CEMENT, EYE CARE, COOKING ... MESS ... OLOGY ... HOME DELIVERY, HOME APPLIANCES, THANKS GIVING, LOST & FOUND GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

AUTOMOTIVE

VEHICLES WANTED

వరంగల్‌లోని యాదాద్రి ఇండస్ట్రీస్‌కు Maruti Omini Vans 100 Vehicles కొరకు 5 Yrs. Long Time Lease కు కావలెను. సం॥ 9133388891.

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్లాస్టిక్ పరిశ్రమ. మెషిన్లు అమ్మకం, ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం, నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 82978 55042.

పేపర్ ప్లేట్స్ తయారుచేయు హైడ్రాలిక్ & ఫుల్లీ ఆటోమెటిక్ మెషిన్లు. నెలకు మంచి ఆదాయం, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. బ్లూ ఇంపెక్స్, ✆ 076590 77712.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. సై్క ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

GST సువిధ సెంటర్స్ ఫ్రాంఛైజీ కోసం జిల్లాలోని అన్ని మండలాల వారీగా INTERNET & MEESEVA మరియు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. వివరాలకు సం॥: 97017 51551, 91770 21347.

BUILDING & CONSTRUCTION

SEPTIC TANK CLEANING

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు Cont: 9849145043, 9866584455.

EDUCATION

కేవలము 2 1/2 నెలల్లోనే ఇంటర్/ డిగ్రీ, బి.టెక్, ఎమ్.టెక్, MBA, M.Phil, P.hD పూర్తి. Eligible for Govt & Private Jobs. C/o. DSR కాలేజీ. Hnk, Cell: 9346634381.

FINANCIAL SERVICES

SHARES

సిద్ధి వినాయక్ షేర్ ట్రేడింగ్. మార్కెట్ స్థితి ఎలా ఉన్నప్పటికీ ప్రతి నెల 8% ఖచ్చితమైన రాబడితో రూ. 50000 నుండి పెట్టుబడి ప్రారంభం. అన్ని పెట్టుబడులకు లీగల్ అగ్రిమెంట్ కలదు. ఆఫీసు మాదాపూర్‌లో కలదు. 040-48517474/ 9176091791 కు కాల్ చేయండి. లేదా director@siddhivinayaktraders.in కు మెయిల్ చేయండి.

REAL ESTATE

HOUSE FOR SALE

90X60 North East Corner Bit 600 Y ఏకశిల కాలనీ (advocates Colony) హన్మకొండ. Cont :9700959577.

PLOT FOR SALE

యాదగిరిగుట్ట నుండి 3Km దూరంలో పెద్ద కందుకూరులో తక్కువ ధరలో ప్లాట్లు అమ్మబడును. మంచి వాస్తు & ప్లాట్లు సైజులు కలవు. అన్ని సౌకర్యాలు కలవు. బ్యాంకులోను కలదు. 040-24126888.

In Nakkalagutta, Beside More Super Market, Opp: Church, 540 Sq. Yards, Open Plot is for Sale. Cell: 9985002241, 9490685482.

SHOP FOR SALE

HNK Prime locationలో మంచి రన్నింగ్ కండీషన్‌లో గల మెడికల్ షాపు అమ్మబడును. ఆసక్తి గలవారు 8978909631.

SITUATIONS VACANT

Service Managers for SAPTAPADII matrimony.com, HNK Branch. Qly: DG/ PG, exp above 3 yrs Any, Sal; 10,000-15000/-, Cont: 8367676156.

రిటైర్డ్ ఉద్యోగులకు, గృహిణులకు, యువతీ, యువకులు ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పని చేయుటకు కావలెను. Age: 23 Yrs. Qual: S.S.C, HNK. Cont: 9704563736.

HNK, Kishanpura లోని శ్రీ లక్ష్మి నర్సింగ్ హోమ్ నందు పని చేయుటకు BSc/GNM నర్సులు కావలెను. సం॥ 9848039034, 9182634040.

Wanted Inter, Degree అభ్యర్థులు Computer (M/F) డాటా ఎంట్రీ ఆపరేటర్స్ రెసెప్షనిస్ట్ & టెలికాలర్ కావలెను. జీ: 5000-8000/- 8297193237.

Hyd లోని నూతనంగా ప్రారంభించిన కం॥లకై హెల్పర్స్, ప్యాకర్స్, ఆపరేటర్స్ వెంటనే కా॥ జీ: 13-18 వేలు రూం+ మీల్స్ ఫ్రీ. ESI, PF చదువులేకున్నా జాబ్ సంప్ర: 7659988595

శ్రీ కన్సల్‌టెంట్ సంస్థలో పని చేయుటకు అనుభవం కల్గిన టెలికాలర్స్ (F) & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. అర్హత: Any Degree. Contact No. 8686968888, 9985751410.

ప్రముఖ MNC కంపెనీ నందు పనిచేయుటకు (F) Age 35 సం॥ లోపు ఆసక్తిగల అభ్యర్థులు & ఏజెన్సీ (M (or) F) కావలెను. Contact No. 9390178793.

వరంగల్‌లోని ప్రముఖ మార్కెటింగ్ కంపెనీ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Salary 25,000/-. Pls. Call: 10 AM - 5 PM. సం॥ 8328083336.

వరంగల్ ప్రజలకు ఉద్యోగ అవకాశం వరంగల్ పట్టణం నందు Non Woven ప్రింటింగ్ బ్యాగ్స్/ Plastic covers మార్కెటింగ్ చేయటకు సేల్స్ ఎక్జ్‌క్యూటివ్ కావలెను వరంగల్ పట్టణం వాసులకు ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం Note: Nofees - Direct Job (only for Gents Q: 10th నుండి డిగ్రీ వయస్సు 25సం॥ నుండి 35సం॥ శ్రీ రాజాబ్యాగ్ డోన్ కర్నూలుజిల్లా ✆ 9440652285, 9963862168

Hydలో 5 Star Hotelsలో, ఫిలిం యాక్టర్స్ & VIP పార్టీకి క్యాటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. వ: 18-30, రూం+మీల్స్ ఫ్రీ. జీ: 12,000- 14,500/- ✆ 8187842675, 7702136573.

Trims Mens Parlour లో పనిచేయుటకు Workers కావలెను. కొత్తూరు మార్కెట్, HNK. Cont: 9989417883.

మా సంస్థలో పనిచేయుటకు ఫీల్డ్ టెక్నిషియన్ 6500+ T.A., టెలికాలర్స్ 4500 కావలెను. అర్హత: ఇంటర్, ITI. P/F 2 వీలర్స్ ఉండవలెను. 9949691670.

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు X to PG అర్హత గల అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఉచిత భోజన వసతి కలదు. Cell. 85109 73559, 85109 73845

హాస్పిటల్‌లో పనిచేయుటకు ANM/ GNM, వార్డ్ బాయ్స్, ఆయాలు కావలెను. బేబీస్ లైఫ్ హాస్పిటల్, సుబేదారి, హన్మకొండ. Cont: 9989510003.

జాబ్ ఆఫర్: Shara గ్రూప్ కంపనీకి క్రొత్త జిల్లాలో పర్మినెంట్ ఉద్యోగాలు. నో ఫీజు, ఫ్రీ రూం. అ: 10th ఆపైన, వ: 18 to 26 సం॥లోపు స్త్రీ/పు. సంప్ర: Wrgl. Cell: 79811 66439, 70363 08141.

Wanted Lab Technician & Staff nurses Sri Sri Neuro Center. HNK, Warangal. Cont: 9951682423, 9849942797.

WGL, HNK లో లేడీ రిసెప్షనిస్ట్, టెలికాలింగ్, సేల్స్ మార్కెటింగ్ Male/F, Q: 10th/ ఇంటర్/ MBA (HR), బిటెక్. @ 9441137413, 7989878461.

Wanted DTP Operator, Primary, Telugu & Hindi, Middle School, Chemistry, Mathematics, Floor incharge (Lady). C: 9392522837/ 9392522840/ 8686236623.

MARKETING / SALES

J.S.R. గ్రూప్ సన్‌సిటీ యాదగిరిగుట్ట, వరంగల్ హైవేలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+కమీషన్+ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. Ph: 7799893899

FACULTY / TEACHERS

Wanted Teachers to Teach Maths & Biological Science for Higher Classes. English Fluency Must in Vani School, Regonda. Cont: 9949743619, 9063795863.

Wanted 8th to 10th Phy. Sci. Tr. Male/ Female, 6 Periods Salary Rs. 18000. School Timings 8-45 am to 5-15 PM. Walk in Interview. Rising Sun School, Kothawada, Wgl. Cell: 8333996260.

మామునూరు శివారు నందుగల నవోదయ కోచింగ్ సెంటర్ నందు ఇంగ్లీషు బోధించుటకు పార్ట్‌టైం ఇంగ్లీషు టీచరు కావలెను. 9676145612, 8978567783.

TOURS & TRAVELS

కావేరిపుష్కరాలు, శ్రీరంగం, మైసూర్, శృంగేరి, గోకర్ణం,మూకాంబిక 7 రో॥ 7200/-10-9 & 15-9 ★ కాశిమినిటూర్,కాశి,ప్రయాగ. 3రో॥ వ॥ భో॥ 3000/- sep-4 సత్యసాయి సేవాసమాజ్ 9618933189.

Singapore & Malaysia @ 49,999/- Dubai & Abudhabi @ 49,999/- Bangkok, Pattaya & Phuket @ 39,999/- Kakani Holidays P.Ltd. ✆ 97016 95555.

శ్రీలంక రామాయణ యాత్ర & శాంకరీదేవితో @ 33,999/- శోభన, ద్వారక, ఉజ్జయిని & ఓంకారేశ్వరితో @ 14,999/- కాకాని హాలిడేస్ ప్రై॥ లిమిటెడ్. ✆ 91779 42424.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వివాహ వేడుకలా పరిచయ వేదిక

'ఈనాడు-పెళ్లిపందిరి'కి హాజరైన మున్నూరు కాపు వధూవరులు

సిద్ధార్థనగర్, న్యూస్‌టుడే : పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు.. కాబట్టి అలాంటి వేడుక చేసుకునేటప్పుడు జీవిత భాగస్వామిని ఎంచుకోవడానికి అన్ని విధాలుగా ఆలోచనలు చేయాలి.. కానీ ఉరుకుల పరుగుల సమాజంలో ఇది సాధ్యం కావడంలేదు. ఇలాంటి వారికి 'ఈనాడు పెళ్లిపందిరి.నెట్' కార్యక్రమంతో అనేక జంటలను సులువుగా కలుపుతుంది. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం ఫాతిమా నగర్‌లోని వైష్ణవీగ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన మున్నూరు కాపు పరిచయ వేదిక పెళ్లి వేడుకలా సాగింది. ఈనాడు పెళ్లి పందిరి.నెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈనాడు వరంగల్ యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాసు, వధూవరుల తల్లులు కె.స్పందన, టి.సరస్వతి, గీతాశ్రీలు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలోని జిల్లాల నుంచి హాజరైన తల్లిదండ్రులు, వధూవరులు వేదికపై పరిచయం చేసుకున్నారు. తమ వివరాలను ఒకరినొకరు పంచుకున్నారు. మున్నూరుకాపు వధూవరులు ముందుగానే వారి వివరాలను 'ఈనాడు'లో నమోదు చేసుకున్నారు. ఈ వివరాలను ఈనాడు పెళ్లి పందిరి.నెట్‌లో పొందుపరిచి, సీడీ రూపొందించారు. సీడీలను వధూవరుల తల్లిదండ్రులకు అందించారు. ఈనాడు పెళ్లి పందిరిలో పెళ్లి కుదిరిన వారు తమ వివరాలను ఈనాడుకు తెలియజేస్తే కళాంజలి తరపున బహుమతి అందిస్తామని ఈనాడు వరంగల్ యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాసు ప్రకటించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి అందరి వధూవరుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు.


వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వరంగల్ ఈనాడు యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, స్పందన, సరస్వతి, గీతాశ్రీ

తీరిక లేని వారికి అవసరం

చైతన్య, వరంగల్

ఇంటర్‌నెట్ వినియోగం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఇళ్ల పక్కనే ఉన్న వారిని గుర్తించడం కూడా కష్టంగా మారింది. అలాంటి వారికి ఈనాడు పరిచయ వేదిక ఉపయోగకరంగా ఉంటుంది. వధూవరుల ఎంపికకు సులువైన మార్గం. యువత కూడా ఎక్కువగా ఈ విధానానికే ప్రాధాన్యమిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా ఉండే అవకాశముంది.

అన్ని ప్రాంతాల వారికి ఉపయోగం

కుమారస్వామి

వివిధ ప్రాంతాలలో ఉండే వారికి ఇది చక్కటి వేదిక. కేవలం వారి జిల్లాలో లేదా పక్క జిల్లాలోనే కాకుండా రాష్ట్రం మొత్తంలో వధూవరులను ఎంచుకోవడానికి ఇది చక్కటి అవకాశం. వధూవరులు వారి తల్లిదండ్రులు వేదిక మీద తమకు కావాల్సిన అంశాలను ప్రకటించడంతో అలాంటి అభిప్రాయాలు కలిగిన వారిని ఎంచుకోవడానికి అవకాశం కలిగింది.


హాజరైన వధూవరులు, వారి సంబంధీకులు

గ్రానైట్‌పై జీఎస్టీ శాతాన్ని తగ్గించాలి

❒ వచ్చే నెల 1 నుంచి పరిశ్రమలు బంద్

❒ రాష్ట్ర అసోసియేషన్ తీర్మానం

జులైవాడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ విధానంలో పూర్తిగా చిన్నతరహా పరిశ్రమలైన గ్రానైట్‌పై 28 శాతం పన్ను విధించడంతో సామాన్యులపై భారం పడుతుందని రాష్ట్ర చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు రవిచందర్ అన్నారు. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్‌లో రవిచందర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 9న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అధ్యక్షతన హైదరాబాద్‌లో నిర్వహించే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు వీరి సమస్యను తెలియజేసేందుకు కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబరు 1 నుంచి గ్రానైట్ పరిశ్రమలను మూసి వేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి జిల్లా నుంచి పాదయాత్రగా హైదరాబాద్ బయలుదేరి వెళ్లాలని, 8వ తేదీ వరకు హైదరాబాద్ చేరుకొని తమ సమస్యలను కౌన్సిల్ సభ్యులకు తెలియజేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ.. గ్రానైట్ పరిశ్రమలను విలాసవంతమైన పరిశ్రమలుగా భావించి కేంద్ర ప్రభుత్వం 2 శాతం పన్నును 28 శాతానికి పెంచిందన్నారు. దీని ద్వారా సామాన్యులపై భారం పడుతుందని, గ్రానైట్ పరిశ్రమనే నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 9న హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి వినిపించేలా నిరసన కార్యక్రమాలు చేయాలని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవిచందర్


సమావేశానికి హాజరైన గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు

ప్రతిభావంతులను గౌరవించుకోవటం మన సంప్రదాయం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రతిభావంతులను గౌరవించుకోవటం మన సంప్రదాయంలో ఒక భాగమని, ప్రతిభావంతులతో పాటు విద్యావంతులు పూర్తిగా వెనుకబడిన వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టెస్టా) ఆధ్వర్యంలో సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని బంజార ఉద్యోగ ఉత్తమ సేవా పురస్కార్ అవార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అన్ని కులాలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి కులంలో ఐక్యతతో పాటు గుణాత్మకమైన మార్పు కనబడుతుందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అనేక వనరులు ఉన్నాయని, సగానికి పైగా అటవీ ప్రాంతం ఉన్నందున, ఈ జిల్లాలో గిరిజనేతరులంతా ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చే వారే ఎక్కువగా ఉంటారన్నారు. ఈ జిల్లాలో కార్మికులు, రైతులు, ఆదివాసీలు ఎక్కువగా ఉండటం వల్ల వీరి అభివృద్ధి కోసమే ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. ఈ మేరకు భూపాలపల్లి నియోజకవర్గంలో 12 వందల జనాభాకు పైగా ఉన్న చెంచు కులస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన చెప్పారు. పదో తరగతి పూర్తి చేసిన ఇద్దరు చెంచు విద్యార్థులను మంచి ప్రభుత్వ గురుకుల కళాశాలలో చేర్పించినట్లు స్పీకర్ తెలిపారు. ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ.. లంబాడీల సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. లంబాడి తండాలను త్వరలోనే ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించటం జరుగుతుందన్నారు. అనంతరం స్పీకర్‌తో పాటు ఎంపీ, టెస్టా నాయకులు కలిసి జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన బంజార ఉద్యోగులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేపట్టిన గిరిజన బాలికల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ సంగావత్ రాజేష్‌నాయక్, జెన్‌కో సీఈ మంగేష్‌నాయక్, భూపాలపల్లి నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బండారి సంపూర్ణ, జడ్పీటీసీ సభ్యురాలు మీరాబాయి, మహిళా ఆర్గనైజర్ భారతమ్మ, ఎంఈవో దేవానాయక్, టెస్టా జిల్లా, రాష్ట్ర నాయకులు సక్రునాయక్, బలరాం నాయక్, అజ్మీర శ్రీనివాస్, రాందాస్ నాయక్, ఇస్లావత్ రాజు, శంకర్‌నాయక్, ధన్‌సింగ్‌నాయక్, తెరాస నాయకులు, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బంజార ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



జెన్‌కో సీఈ మంగేష్‌నాయక్‌ను సన్మానిస్తున్న స్పీకర్, టెస్టా నాయకులు

స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

స్పీకర్ వాహనాన్ని అడ్డగించిన గ్రామస్థులు

కరకపల్లి (గణపురం), న్యూస్‌టుడే: కరకపల్లి శివారు లక్ష్మారెడ్డిపల్లి గ్రామం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయం కావడంతో ఆగ్రామంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈసందర్భంగా ఆదివారం స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లి నుంచి వెళుతుండగా మార్గమధ్యంలో హఠాత్తుగా ఆగ్రామస్థులు ఆయన వాహనాన్ని అడ్డగించారు. పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఆయన పీఆర్ అధికారులను పిలిపించి అక్కడికక్కడే 200మీటర్ల మెటల్ రోడ్డు వేయించారు. తన నియోజకవర్గంలో మరో సారీ ఇలాంటి పరిస్థితి రాకూడదని పీఆర్ ఏఈ యాదగిరిని హెచ్చరించారు. ప్రతీ గ్రామంలో రోడ్లను మరమ్మతులు చేయించాలన్నారు. అయితే అప్పటికప్పుడే రోడ్డు వేయించడంతో గ్రామస్థులు సంతోషపడ్డారు.



రోడ్డు పై కంకరపోస్తున్న దృశ్యం

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

భూపాలపల్లి డీఎస్పీ శ్రీనివాస్

భూపాలపల్లి క్రైం, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు, ఉత్సవకమిటీ నాయకులు ఏర్పాటు చేసుకునే మండపాల వద్ద కావాలని ఎవరైన గొడలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో పట్టణంలోని వ్యాపారులు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మైనార్టీ నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సభ్యులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. నవరాత్రి వినాయక ఉత్సవాలు నిర్వహించే ఉత్సవ కమిటీల సభ్యులు ముందుగా పోలీసు స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండపాల వద్ద గాని ఊరేగింపు సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లో డీజే సౌండ్ సిస్టాన్ని ఉపయోగించకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవరిస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. సమావేశంలో సీఐ వేణు, ఎస్సైలు వెంకట్రావు, రాకేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

కరపత్రాల కలకలం

భూపాలపల్లి క్రైం, న్యూస్‌టుడే: భూపాలపల్లి పట్టణంలో ఆదివారం వెలిసిన గోదావరిలోయ స్పెషల్ ఏరియా కమిటీ సీపీఐ (ఎం-ఎల్) సీపీ బాట పేరుతో నాలుగు పేజీలతో వెలువడిన కరపత్రాలతో పట్టణంలో కలకలం సృష్టించింది. నక్సల్ బరీ పోరాటాల ద్వారా నిర్వహించిన ప్రజా ఉద్యమాలు, న్యూడెమోక్రసీ పేరిట కొనసాగుతున్న రెండు సంస్థలు 1996 నుంచి చేపట్టిన గోదావరిలోయ ప్రతిఘటనోద్యమాల గురించి ఆ కరపత్రాల్లో వివరించారు. అదేవిధంగా మార్క్సిజం-లెనినిజం, మావోయిజం వర్ధిల్లాలి. నూతన ప్రజాస్వామిక విప్లవం, వ్యవసాయ విప్లవం వర్ధిల్లాలి, గోదావరిలోయ కరీంనగర్ ప్రతిఘటనోద్యమాలు వర్ధిల్లాలని ఆ కరపత్రాల్లో పేర్కొన్నారు. ఈ కరపత్రాల గురించి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

26న భూపాలపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం బ్యారేజి నిర్మాణంపై పలు జిల్లాలలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశిస్తూ ఆయా జిల్లా కేంద్రాలలో సమావేశం నిర్వహించాలని పలు తేదీలను ఖరారు చేయడం జరిగింది. దీనిలో భాగంగా కాళేశ్వరం బ్యారేజి నిర్మాణంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీతో పాటు కన్నెపల్లి ప్రధాన పంపుహౌస్ నిర్మాణాలపై ఈ నెల 26 భూపాలపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కాగా జిల్లా పాలనాధికారి మురళి, సయుక్త పాలనాధికారి అమయ్‌కుమార్, కాళేశ్వరం బ్యారేజీ చీఫ్ ఇంజినీర్ నల్ల వెంకటేశ్వర్లుతో పాటు రెవెన్యూ, ఇంజినీర్లు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో పాల్గొనున్నట్లు తెలిసింది.

ఉద్యమాల పురిటి గడ్డకు గుర్తింపేది?

చిట్యాల, న్యూస్‌టుడే: ఎన్నో ఉద్యమాలకు పురిటి గడ్డగా పేరుగాంచిన మన చరిత్ర కలిగిన పరకాలకు నేడు తెలంగాణ ప్రభుత్వంలో గుర్తింపేది? అని పరకాల జిల్లా సాధన కమిటీ ఛైర్మన్ పిట్ట వీరస్వామి ప్రశ్నించారు. ఆదివారం చిట్యాలలో దొడ్డి కిష్టయ్య అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష సమావేశానికి వీరస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పరకాలను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే చిట్యాల, మొగుల్లపల్లి, రేగొండ, శాయంపేట, టేకుమట్ల మండలాల్లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో రాజకీయాలకతీతంగా అఖిల పక్ష కమిటీలను వేసి పరకాలకు సముచిత స్థానం కల్పించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని వీరస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో కొల్గూరి రాజేశ్వర్‌రావు, గోపినాథ్, జయంతీలాల్, కామిడి రత్నాకర్‌రెడ్డి, గొర్రె సాగర్, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, బుర్ర వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణం... ముక్తి పొందిన భక్తజనం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో వేలాది మంది భక్తులు శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించి మాసం పాటు శివకేశవుల ఆశీస్సులను పొందారు. శుభప్రదమైన శ్రావణ మాసం నేడు సోమతి అమావాస్యతో ప్రవేశించి శుభ ప్రద మాసం పూర్తి కావడంతో సోమవారం భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు మంగళం పాడేందుకు సిద్ధమవుతున్నారు. జులై 24న ప్రారంభం అయిన శ్రావణ మాసం నేటితో పరిసమాప్తి కానుంది. గోదావరి ప్రవాహంలో దీపారాధనతో పాటు దీపాలను వదిలి మనసారా గంగమ్మను కొలిచారు. అనంతరం సన్నిధానం చేరుకొని శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన పలు పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో నెల రోజుల పాటు భక్తుల నిర్వహించిన పలు పూజలతో ఆలయానికి ఆదాయం 40 లక్షలు చేకూరింది. దేవస్థానం అధికారులు నిర్ణయించిన పూజల ధరలకు భక్తుల నుంచి భిన్న అభిప్రాయాలు వ్యక్తం కాకుండ మనసా, వాచా పూజలు నిర్వహించి శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుని ఆశీస్సులను పొందారు.

ఒప్పంద కార్మికుల మిఠాయిల పంపిణీ

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి అన్వేషణ విభాగంలో పనిచేసే ఒప్పంద కార్మికులు ఆదివారం మిఠాయిలు పంపిణీ చేశారు. ఒప్పంద కార్మికులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోను అమలు చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేయడంతో ఒప్పంద కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి కృషి ఫలితమేనని తెలంగాణ మల్టీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఇ.శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి కూడా వేతనాలు పెరిగాయని, దీనికి కృషి చేసిన నాయకులకు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ సంఘాల కృషి ఫలితమే వేతనాల పెంపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: జాతీయ కార్మిక సంఘాల కృషి ఫలితంగానే ఒప్పంద కార్మికులకు వేతనాలు పెరిగే విధంగా ఆదేశాలు జారీ చేసిందని ఐఎన్టీయూసీ నాయకులు బి.రాజలింగం, జి.కుమారస్వామి తెలిపారు. ఇటీవల కేంద్ర బొగ్గుశాఖ మంత్రితో పాటు కేంద్ర కార్మిక శాఖ కమిషనర్‌ను కలిసి ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరిన మేరకు సింగరేణికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. దాని ఫలితంగానే యాజమాన్యం ఒప్పంద కార్మికులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం వేతనాలు చెల్లింపునకు ఆదేశాలు జారీ చేసిందన్నారు.

బదిలీలు రద్దు చేసే వరకు ఉద్యమాలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: యాజమాన్యం అక్రమంగా చేసిన తమ బదిలీలను రద్దు చేసేంత వరకు ఉద్యమాలు ఆగవని హెచ్ఎంఎస్ నాయకులు ఎన్.దశరథంగౌడ్ అన్నారు. ఆదివారం ఆర్జీ-2 డివిజన్‌లోని ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్ ఆవరణలో నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల గొంతు నొక్కేలా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం వ్యవహరించిందన్నారు. కార్మికుల పక్షాన ఉండాల్సిన సంఘం యాజమాన్యానికి తొత్తుగా మారిందన్నారు. కార్మికులు అండగా ఉన్నంత వరకు తమను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. సమావేశంలో సత్తయ్య, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.



పదో తరగతితోనే గిరిజనులకు ఉద్యోగ అవకాశం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: పదో తరగతి చదివిన ప్రతి గిరిజన యువకుడు సింగరేణి సంస్థలో భర్తీ కాబోతున్న బదిలీఫిల్లర్ పోస్టుకు అర్హుడేనని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పంతులనాయక్ అన్నారు. ఆదివారం కాలనీలోని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది సంవత్సరాల తర్వాత సంస్థలో ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఇటు ప్రభుత్వం అటు యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇందులో 665 పోస్టులను భర్తీ చేయనున్నారని సింగరేణి విస్తరించిన పాత నాలుగు జిల్లాలకు చెందిన యువతకు 80 శాతం రిజర్వేషన్ ఉండగా మిగతా జిల్లాల వారికి 20 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. కేవలం రాత పరీక్ష ద్వారా నియామకం ఉంటుందని, పోస్టుల భర్తీ విషయంలో యువకులు దళారుల మాటలను నమ్మవద్దన్నారు. సమావేశంలో బి.శంకర్‌నాయక్, హరియానాయక్, రామకోటి, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులకు వర్షపు కోట్లు వెంటనే ఇవ్వాలి

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీపీ-1, కేటీకే ఓసీపీ-2లలో పని చేస్తున్న కార్మికులకు వర్షకాలపు, చలికాలంలో వేసుకునే కోట్లను వెంటనే ఇవ్వాలని ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు సమ్మిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఓసీపీలో ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్స్, పంపు ఆపరేటర్స్, తదితర డిజిగ్నేషన్స్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరందరికీ వర్షకాలపు, చలికాలపు కోట్లను ఇంత వరకు ఇవ్వడం లేదన్నారు. కార్మికులు అనేక ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం స్పందించి వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు బుచ్చయ్య, హుస్సేన్, శ్రీనివాస్ ఉన్నారు.

వేతన ఒప్పంద చర్చలు 24కు వాయిదా

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: 10వ వేతన ఒప్పంద చర్చలు మళ్లీ ఈనెల 24వ తేదీకి వాయిదా పడ్డాయి. జార్ఖండ్‌లోని రాంచీలో బొగ్గు పరిశ్రమల యాజమాన్యాలు, జాతీయ కార్మిక సంఘాల మధ్య వేతన ఒప్పందపై చర్చలు జరిగాయి. ముందుగా వేతన సవరణ పెంపుపై సుదీర్ఘ చర్చ జరిగింది. 21శాతానికి మాత్రమే పెంపు చేస్తామని యాజమాన్యాలు వెల్లడించాయి. గత 9వ వేతన ఒప్పందంలోనే 25శాతం వేతన ఒప్పందం జరిగిందని ఇప్పుడు అంతకంటే తక్కువగా ఉందని కార్మిక సంఘాల నేతలు అంగీకరించలేదు. 25శాతం పెంపు చేసి 4శాతం ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఈనెల 24కు చర్చలను వాయిదా వేశారు. ఈ చర్చల్లో వేతన సవరణపై స్పష్టత రానుంది.

ప్రసూతి సెలవులు పెంపు

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: సింగరేణిలో పని చేస్తున్న మహిళ ఉద్యోగినులకు ప్రసూతి సెలవులు పెంచుతూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు మహిళా ఉద్యోగినులకు ప్రసూతి సెలవులు 12 వారాలు మాత్రమే ఉండేవి. దాన్ని 26 వారాలకు పెంపు చేసినట్లు అధికారులు తెలిపారు.

అభాగ్యులకు అండ!


వరంగల్ స్టేషన్ పార్కు వద్ద నిరాశ్రయ కేంద్రం

సకల సౌకర్యాలతో నిరాశ్రయ కేంద్రాలు

న్యూస్‌టుడే, కార్పొరేషన్(హన్మకొండ)

ఆరేళ్ల క్రితం భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశానుసారంగా అభాగ్యుల కోసం నిరాశ్రయ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. దేశంలోని అన్ని పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇళ్లు లేని వారు, కుటుంబాలకు దూరమై రైల్వే, బస్ స్టేషన్లు, రోడ్లు, పార్కులు, ఫుట్‌పాత్‌లపై నిద్రించే వారికి శాశ్వతంగా ఆశ్రయం కల్పించడం వీటి ప్రధాన ఉద్దేశం. కనీస వసతులతో ఆశ్రయం, వీలైతే భోజనం సైతం అందించేలా చర్యలు చేపడుతున్నారు.

సకల సౌకర్యాల..

● హన్మకొండ ప్రాంతం కేయూసీ రెండో గేటు సమీపంలో పలివేల్పులలో నిరాశ్రయ కేంద్రం ఉంది. ఇది లార్డ్స్ సంస్థ పర్యవేక్షణలో కొనసాగుతుంది. ఇక్కడ 25-35 మంది వరకు అభాగ్యులు ఉంటున్నారు. కొంత మంది దీర్ఘకాలికంగా ఉంటుండగా, మరికొంత మంది మాత్రం వస్తూ, పోతూ ఉన్నారు. గ్రామాల నుంచి పని కోసం వచ్చే వారు సైతం ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. నిద్రించేందుకు కామన్‌హాల్, టీవీ, స్నానాల గదులు, టాయిలెట్స్, వంటశాల, తాగునీటి వసతి ఉంది. ఎవరైనా వంట చేసుకుందుకు వీలుగా గ్యాస్ పొయ్యి సైతం ఉంది. ఉదయం ఉచితంగా టీ ఉచితంగా ఇస్తారు. రాత్రి వేళల్లో కొంత మందికి భోజనం అందిస్తారు.

● వరంగల్ ప్రాంతంలో ఎస్‌ఎన్‌ఎంఆర్ క్లబ్ పక్కనే స్టేషన్ పార్కు ముందు నైట్ షెల్టర్ కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మించారు. ఇక్కడ సుమారు 20-30 మంది ఆశ్రయం పొందుతున్నారు. డాన్‌బాస్కో సంస్థ పర్యవేక్షణలో కొనసాగుతుంది. కామన్ హాల్, స్నానాల గదులు, టాయిలెట్ బ్లాక్స్, వంటశాల, గ్యాస్, తాగునీటి వసతి ఉంది. కాలక్షేపం కోసం టీవీ ఉంది. నిద్ర కోసం ఇనుప మంచాలు, పరుపులు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్, పార్కులో నిద్రించే వారికి శాశ్వత పరిష్కారం లభించింది. ఆశ్రయం శుభ్రంగా ఉంచేందుకు పనివాళ్లు సైతం ఉన్నారు.

విజయవంతంగా..

అభాగ్యులకు అండ దండగా నిలిచేందుకు వరంగల్ మహా నగరంలో పట్టణ నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నాయి. హన్మకొండ ప్రాంతంలో పలివేల్పుల, వరంగల్ ప్రాంతంలో ఎస్‌ఎన్ ఎంఆర్ క్లబ్ పక్కన ఈ కేంద్రాలు సుమారు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, ఆలయాలు, రైల్వే, బస్‌స్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిద్రించే వారిని ఇక్కడికి తరలించారు. వీరేగాక కూలీ పనుల కోసం పట్టణాలకు వచ్చే వారికి సైతం ఈ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. మీకు మేమున్నామని భరోసా కల్పిస్తున్నాయి.

మరో రెండు కేంద్రాలు?

పలివేల్పుల, వరంగల్ స్టేషన్ పార్కు వద్ద కొనసాగుతున్న నైట్ షెల్టర్లను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారి వివరాలు నమోదు చేసుకున్నారు. వీరికి బట్టలు, ఇతర వస్తువులు స్వచ్ఛంద సంస్థల ద్వారా అందేలా చూస్తున్నారు. కొత్తగా మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కార్పొరేషన్ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో అభాగ్యులను గుర్తించేందుకు అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము వరకు మహానగరంలో పర్యటించారు. 177 మంది నిరాశ్రయులను గుర్తించారు. వీరికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి, ఆ వివరాలన్నీ కంప్యూటర్‌లో పొందుపర్చారు. వీరిలో వృద్ధులు, మహిళలు, యువకులు ఉన్నారు. అర్హులైన వారికి ఆధార్ కార్డులు ఇప్పించి, ఆసరా పథకం ద్వారా సామాజిక పింఛన్లు సైతం వచ్చేలా చూశారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు సైతం భోజనం, దుస్తులు, ఇతర వస్తువులు అందజేస్తున్నాయి. మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది.. కాజీపేట బాపూజీనగర్ స్లాటర్ హౌజ్, హన్మకొండ ప్రాంతం నయీంనగర్ కూరగాయల మార్కెట్ ఆవరణను ఇందుకు అనువైన స్థలాలుగా గుర్తించారు. కమిషనర్ శ్రుతిఓజా దృష్టి సారిస్తే త్వరితగతిన ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

హరిత హారంలోనూ..

మెప్మా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో అభాగ్యులను భాగస్వామ్యులను చేస్తున్నారు. వరంగల్ ప్రాంతంలోని ఎస్‌ఎన్‌ఎంఆర్ క్లబ్ పక్కనే ఉన్న నిరాశ్రయ కేంద్రంలో వృద్ధులు, మహిళలు మొక్కలు నాటారు. కేంద్రం ఆవరణలో, వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్, స్టేషన్ పార్కు ఆవరణలో ఇంతేజార్ గంజ్ పోలీసులు, మెప్మా ఆధ్వర్యంలో మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. పలివేల్పుల కేంద్రంలోనూ మొక్కలు నాటారు. సామాజిక కార్యక్రమాల్లోనూ వీరిని భాగస్వామ్యులు చేయాలని అధికారులు చూస్తున్నారు.


నైట్ షెల్టర్‌లో సేదదీరుతున్న అభాగ్యులు

సాహితీ వనంలో 'ప్రభాకరుడు'

రచయిత, దర్శకుడు, నటుడిగా రాణిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి

న్యూస్‌టుడే, జనగామ అర్బన్

సామాన్య నేపథ్యం.. కుటుంబ సభ్యులకు ఏమాత్రం సంబంధం లేని రంగం.. ఉన్నోళ్లమని గానీ, లేనోళ్లమని గానీ ఎటూ చెప్పుకోలేని మధ్య తరగతి కుటుంబం.. చుట్టూ అనేక అవరోధాలు.. అయినప్పటికీ వాటిని ఎదుర్కొంటూ ఇష్టమైన రంగంలో సాగుతున్న వైనం.. తెలుగు చిత్రానికి జాతీయ స్థాయి అవార్డును తీసుకురావడమే లక్ష్యంగా సాహిత్య, సినిమా రంగంలో రాణిస్తున్న వరంగల్ బిడ్డ.. బాల్యంలో చవిచూసిన అనుభవాలు, ఎదుర్కొన్న కష్టాలు, సమాజ పోకడలు తనను రచయిత, కవి, దర్శకుడిగా ఎదిగేలా చేశాయంటున్న ప్రభాకర్ జైని సాహిత్య, సినీ రంగ సేవలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

నేపథ్యం..

ప్రభాకర్ జైనిది వరంగల్ అయినప్పటికీ పుట్టింది.. ఎక్కువ కాలం గడిపింది మాత్రం జనగామలోనే. చిన్నతనంలో సెలవులు వస్తే రెక్కలు కట్టుకుని జనగామలో వాలిపోయేవారు. ఇప్పుడున్న నెహ్రూ పార్కు ప్రాంతంతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్ సమీపంలోనే వాళ్ల అమ్మమ్మ వాళ్ల ఇల్లు ఉండేది. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భార్య విజయలక్ష్మి, ముగ్గురు పిల్లలు.. స్రవంతి, చైతన్య, ఆకాశ్ ఉన్నారు. ప్రభాకర్ జైని తన తండ్రి మరణించిన తర్వాత కారుణ్య నియామకం ద్వారా వరంగల్ మున్సిపాలిటీలో ఉద్యోగిగా చేరారు. అనంతరం యూకో బ్యాంకులో ఉద్యోగం చేశారు. తర్వాత వాణిజ్య పన్నుల శాఖలో సీటీవోగా పనిచేస్తూ 2014లో ఉద్యోగ విరమణ పొందారు.

చిన్ననాటి అనుభవాలే..

చిన్నతనంలో ప్రభాకర్ జైని చూసిన సంఘటనలు, చవిచూసిన అనుభవాలే ఆయనను రచయిత, దర్శకుడి మారడానికి ఉపకరించాయి. ప్రభాకర్ జైని తండ్రి లక్ష్మీనారాయణది మొదటగా నల్గొండ జిల్లా. రజాకార్ల దాడుల వల్ల సర్వం కోల్పోయిన ఆయన పొట్ట చేతపట్టుకుని వరంగల్‌కు వలస వచ్చారు. చిన్నతనంలోనే నాన్నను పోగొట్టుకోవడంతో తల్లి, ఇద్దరు తమ్ముళ్లు, చెల్లెలి బాధ్యతలను ప్రభాకర్ సమర్థంగా నిర్వర్తించారు.

సమాజానికి దర్పణం..

మొదటి నుంచి రచనారంగంపై ఆసక్తి ఉన్నప్పటికీ, 1981లో ఆయన మొదటి కథ 'ఎదను ధర్మం' ప్రచురితమైంది. 1989లో దాదాపుగా ఆయన ఆత్మకథను పోలి ఉండే 'కాలవాహిని అలల వాలున' అనే నవలను రాశారు. ఐఏఎస్‌కు ఎంపికైన ఓ పేద విద్యార్థి నేపథ్యాన్ని ఇందులో చిత్రీకరించారు. అప్పట్లో అది ఓ వారపత్రికలో ధారావాహికగా ప్రచురితమైంది. 1992లో రజాకార్ల ఉద్యమ నేపథ్యంతో 'గమ్యం', షేర్ మార్కెట్ నేపథ్యంతో 1994లో 'చోర్ బజార్', 2007లో దుబాయ్, పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ మీదుగా దేశంలోకి నకిలీ కరెన్సీ సరఫరా అవుతున్న విధానాన్ని 'రూపాయిలొస్తున్నాయ్ జాగ్రత్త' అనే నవలగా రాశారు. 'రూపాయిలొస్తున్నాయ్ జాగ్రత్త' నవల కన్నడంలోకి సైతం అనువాదమైంది. 2014లో సినిమాకు సంబంధించి 24 కళలను దర్శకుని కోణం నుంచి తెలిపేలా 'నా సినిమా సెన్సార్‌రైపోయింది' అనే నవల రాశారు. ఇదే నవల ఆంగ్లంలో 'ఐ గాట్ యూ' పేరుతో ప్రచురితమైంది. 2015లో జీవితం - ఓటమి=గెలుపేనా?, సినీ పరిశ్రమలో ఉండే ఇబ్బందులు, బాధలను నేపథ్యంగా ఈ ఏడాది 'సినీవాలి' నవల రాశారు. ఈ నవలలన్నీ విశేష పాఠకాదరణ పొందాయి. ప్రస్తుతం 'లాకర్ నంబర్ 369' అనే నవలను రాస్తున్నారు. తన బాల్యంలో జనగామలో కోటీశ్వరుడిగా బతికిన తనకు మామయ్య వరసయ్యే వ్యక్తి జీవిత చరమాంకంలో దీనస్థితిని నేపథ్యంగా చేసుకుని 2016లో 'మీల్స్ టికెట్' కథను రాశారు. 2002లో రజని-కుందుర్తి పురస్కారాన్ని సైతం పొందారు.



సినీవాలి పుస్తక ముఖ చిత్రం

క్యాంపస్ అంపశయ్య..

సాహిత్యంలో తనకంటూ ఓ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న అనంతరం సినిమా రంగంపై దృష్టి సారించారు. తెలుగు చిత్రపరిశ్రమకు జాతీయ స్థాయి అవార్డు సాధించిపెట్టడమే ధ్యేయంగా పరిశ్రమలోకి అడుగు పెట్టిన ప్రభాకర్ 'అమ్మా నీకు వందనం' చిత్రాన్ని, 'హూ కిల్డ్ మి' అనే లఘు చిత్రాన్ని తీశారు. విలువల వలువలు విప్పేస్తూ స్త్రీల అంగాంగ ప్రదర్శనలతో వికట్టహాసం చేస్తున్న సినిమాలు కాకుండా, మనిషి కేంద్రంగా మానవతా విలువలే లక్ష్యంగా.. సమాజానికి సందేశాన్ని ఇచ్చే లఘు చిత్రాలు, సినిమాలను తీస్తున్నారు. ప్రముఖ రచయిత నవీన్ 'అంపశయ్య' నవల ఆధారంగా గతేడాది 'క్యాంపస్ అంపశయ్య' అనే చిత్రాన్ని నిర్మించారు. విశేష ప్రేక్షకాదరణ పొందిన అంపశయ్యను సినిమాగా తెరకెక్కించాలని పలు ప్రయత్నాలు జరిగినప్పటికీ, లాభాలు తెచ్చిపెట్టదనే కారణంతో ఆ సాహసానికి ఎవరూ ముందుకు రాలేదు. ప్రభాకర్ మాత్రం అంపశయ్య చిత్రాన్ని తీసి తీరాలని నిర్ణయించుకుని విజయవంతంగా పూర్తి చేశారు. 2014లో ఆయనను భరతముని ఆర్ట్స్ అకాడమీ ఉత్తమ ప్రయోగాత్మక దర్శకుడి అవార్డుతో సన్మానించింది.


క్యాంపస్ అంపశయ్య చిత్రంలోని ఓ దృశ్యం


సామాజిక సేవలోనూ...

జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించి, పేద, మధ్యతరగతి సమాజాన్ని దగ్గరగా చూసిన వ్యక్తి కావడంతో తనవంతుగా సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. 2006లో తన తండ్రి పేరిట లక్ష్మీనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. పాత వరంగల్ జిల్లాలో ఓ పాఠశాలను దత్తత తీసుకుని ఆ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు కావాల్సినవి సమకూర్చుతున్నారు. 2007 నుంచి తల్లిదండ్రుల పేరు మీద కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకం అందజేస్తున్నారు.

జాతీయ అవార్డే లక్ష్యం: ప్రభాకర్ జైని



తెలుగు చిత్రానికి జాతీయ స్థాయి అవార్డును తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. నేను రాసిన నవలలు, కథలు.. సాహిత్యాభిమానుల ఆదరణ పొందడం సంతోషంగా ఉంది. జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఆర్థికసాయంతో ఓ భారీ చిత్రాన్ని తీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయ స్థాయి అగ్రనటులతో నాలుగు భాషల్లో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం. ప్రస్తుతం 'లాకర్ నంబర్ 369' అనే నవల రాస్తున్నాను. నేను రాసిన 'పాదముద్రలు' అనే కవితా సంకలనాన్ని సెప్టెంబర్ 3న రవీంద్రభారతిలో ఆవిష్కరించనున్నాం. తెలుగు మాట్లాడడమనేది ప్రస్తుతం నామోషీగా మారిపోయింది. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు యువ రచయితలు కృషి చేయాలి.


ప్రభాకర్ జైని రాసిన పుస్తకాలు

ఆకలి పోరులో అలసి..

జానెడు పొట్టను నింపుకోవడానికి మనిషి ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. బతుకుదెరువు కోసం చిరు వ్యాపారాలు చేసుకునేవారు దొరికిందేదో తింటూ, అలసిన చోటే విశ్రాంతి తీసుకుంటుంటారు. పొట్టకూటి కోసం రాజస్థాన్ నుంచి వలస వచ్చిన బాలియా కుటుంబం గాలి బొమ్మలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. జనగామలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధివీధినా తిరిగి అలసిపోయి సాయంత్రం వేళల్లో జనగామ ప్రధాన చౌరస్తాలో ఇలా కునుకుతీస్తూ కనిపించారు.


-ఈనాడు, జనగామ


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ, చుక్కా రామయ్య, వనజీవి రామయ్య (పాతచిత్రం)

చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ.. ఓ మంచి పుస్తకం కొనుక్కో- పుస్తక ప్రాధాన్యాన్ని తెలిపే అత్యుత్తమ సూక్తుల్లో ఇదీ ఒకటి. అత్యుత్తమ వికాస సాధనకు అతి సులవైన మార్గం పుస్తక పఠనం.. భావి భారత పౌరులైన విద్యార్థులకు పుస్తకాల విశిష్ఠతను తెలియజేయడంతో పాటు వారితో మంచి పుస్తకాలు చదివించి.. వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలనే ఆశయంతో మారుమూల గ్రామీణ పేద విద్యార్థుల నిలయం అయిన శ్రీ వ్యాస ఆవాసంలో సులక్ష్య సేవా సమితి ఓ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. విభిన్న రకాల పుస్తకాలను సేకరించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చి వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా చేస్తున్న ఈ కృషిపై పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ గ్రంథాలయ ఏర్పాటు, ప్రత్యేకతలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, విద్యానగర్(హన్మకొండ)

ఉన్నత ఆశయంతో.. ఉజ్వల భవిష్యత్తుకు..

- సులక్ష్య సేవా సమితి ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు
- విభిన్న పుస్తకాలతో విద్యార్థుల్లో మూర్తిమత్వానికి దోహదం

పేద విద్యార్థుల కోసం..

వారంత మారు మూల ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు... చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా.. చదివించే స్తోమత మాత్రం వారి తల్లిదండ్రులకు లేదు. ఇలాంటి విద్యార్థుల కోసమే సేవభారతి ఆధ్వర్యంలో హన్మకొండలోని హంటర్‌రోడ్‌లో శ్రీవ్యాస ఆవాసాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇందులో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక గ్రంథాలయం ఉండాలనే గొప్ప ఆలోచనతో హన్మకొండలోని సులక్ష్య సేవా సమితి గ్రంథాలయ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ నెల 13న మహారాష్ట్ర అదనపు డీజీపీ, సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ, ప్రముఖ విద్యా వేత్త చుక్కా రామయ్య, వనజీవి పద్మశ్రీ రామయ్య చేతుల మీదిగా పుస్తక దేవాలయాన్ని ప్రారంభించారు. విభిన్న పుస్తకాలకు చోటు కల్పించి విద్యార్థులను చదివేలా ప్రోత్సహిస్తున్నారు.

అన్ని రకాల పుస్తకాలు...

ఈ గ్రంథాలయంలో వ్యక్తిత్వ వికాసం, నీతి కథలు, విజయగాథలు, వ్యాకరణం, బొమ్మల కథలు, భారతీయ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు, సైన్స్, టెక్నాలజీ, గణితం, ఆరోగ్యం, జనరల్ నాలెడ్జ్ ఇలా.. అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అలమారాలు ఏర్పాటు చేసి పుస్తకాలను సక్రమంగా అమర్చారు. విద్యార్థులు చదివేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. పుస్తక ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించి వారిలోపఠనంపై ప్రత్యేక ఆసక్తిని కలిగేలా చూస్తున్నారు. విద్యార్థులు సైతం అందుబాటులో ఉన్న పుస్తకాలను చదువుతూ తమ మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. ఈ అతిథులతో 'న్యూస్‌టుడే' అనంతరం ప్రత్యేకంగా మాట్లాడింది. వారు ఏమన్నారంటే..

దేశ భవిష్యత్తు గ్రంథాలయాల్లో..: వి.వి. లక్ష్మీనారాయణ, మహారాష్ట్ర అదనపు డీజీపీ, సీబీఐ పూర్వ జేడీ

తరగతి గదుల్లో, గ్రంథాలయాల్లో మాత్రమే దేశ భవిష్యత్తు నిర్మితమవుతుంది. అందుకే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. శ్రీవ్యాస నిలయంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం సంతోషదాయకం. దానిని నేను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇక్కడి విద్యార్థులను పుస్తకాలు బాగా చదివేలా చూడాలి. తద్వారా వారు జ్ఞానవంతులే కాకుండా గుణవంతులుగానూ మారుతారు.



ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలి: చుక్కా రామయ్య, ప్రముఖ విద్యా వేత్త

విద్యాసంస్థలకు గ్రంథాలయం అనేది అత్యంత ముఖ్యమైనది. కానీ నేడు చాలా విద్యా సంస్థల్లో సరియైన గ్రంథాలయాలు లేవు. దీంతో విద్యార్థులు చాలా రకాలుగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మారు మూల ప్రాంతాలకు చెందిన విద్యార్థుల కోసం మంచి మంచి పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప పనిగా చెప్పవచ్చు. ప్రతి విద్యాసంస్థలోనూ గ్రంథాలయం ఉండేలా చూడాలి.



దేవాలయంతో సమానం: దారిపల్లి రామయ్య, వనజీవి, పద్మశ్రీ అవార్డు గ్రహీత

విద్యార్థులు ఏ మాత్రం తీరిక సమయం దొరికిన గ్రంథాలయంలో గడపాలి. గ్రంథాలయం దేవాలయంతో సమానం. పేద విద్యార్థుల కోసం ఎంతో గొప్ప మనస్సుతో శ్రీవ్యాస నిలయంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుంది. దీన్ని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది వివిధ ప్రాంతాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి.



విద్యార్థుల కోసం...: మండువ సంతోశ్, సులక్ష్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. అందులో భాగంగానే పేద విద్యార్థులు ఉండే శ్రీవ్యాస ఆవాసంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాం. 'పుస్తకాలను బహుమతిగా ఇవ్వండి - జ్ఞానాన్ని పంచండి' అనే నినాదంతో మా మిత్రులను కలవగా.. వారు ఎంతో సానుకూలంగా స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించేందుకు వివిధ పుస్తకాలు అందజేశారు. ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా క్రమశిక్షణ, నైతిక విలువలతో పాటు నూతన విషయాలు నేర్చుకోవచ్చు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.




గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

రౌడీయిజంపై ఉక్కుపాదం

☛ ఉపేక్షించేది లేదంటున్న పోలీసులు

☛ శ్రుతి మించితే పీడీ యాక్టు



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసులు రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో హన్మకొండలో ఉండే రవీందర్‌రావు అనే వ్యక్తిపై రౌడీషీట్ తెరిచారు. ఈయన సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం దుకాణంలో మత్తులో నానా హంగామా సృష్టించాడు. దుకాణంలో వస్తువులను చిందరవందర చేశాడు. అడ్డువచ్చిన వారిని సైతం గాయపర్చేందుకు ప్రయత్నించాడు. నిర్వాహకులు పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు అతన్ని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అతను మద్యం మత్తులో పోలీసుస్టేషన్లలో కూడా ఇష్టం వచ్చినట్లు పోలీసులపై దుర్భాషలాడాడు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు చివరకు రౌడీషీట్ తెరిచారు. ఇలాంటి ఘటనలు శ్రుతి మించితే పీడీ యాక్టు పెట్టేందుకు సైతం వెనుకంజ వేసేది లేదని పోలీసు అధికారులంటున్నారు.

ప్రత్యేక నిఘా

ఇటీవల వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మూడు హత్యలు జరిగాయి. అప్రమత్తమైన పోలీసులు రౌడీయిజంపై నిఘా ఏర్పాటు చేశారు. గతంలో రౌడీషీట్లు ఉన్నవారు ఎక్కడ ఉన్నారు. వారు ఏం చేస్తున్నారు. వారికి ఎవరితో సంబంధాలున్నాయనే కోణంలో విచారణ చేస్తున్నారు. ప్రతి పోలీసుస్టేషన్ వారీగా రౌడీషీట్ల జాబితాను తీసుకొని ప్రత్యేక పోలీసు విభాగం సిబ్బంది ఎలా పని చేస్తున్నారనే కోణంలో విచారణ చేస్తున్నారు. వీరిపై కొన్ని రోజులుగా నిఘా ఉంచిన పోలీసులు కొంత మంది రహస్యంగా పంచాయతీలు, సివిల్ తగదాలలో తలదురుస్తూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. వీరిపై పోలీసులు ఆగ్రహంగా ఉన్నారు. వారిని పోలీసుస్టేషన్లకు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. అయినా మార్పు రాకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కమిషనరేట్ పరిధిలో స్నేహపూర్వకమైన పోలీసింగ్‌ను కొనసాగిస్తూ అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతున్నారు.

మద్యం దుకాణాలలో నిత్యం గొడవలు

నగరంలో పలు మద్యం దుకాణాలలో గొడవలు నిత్యం జరుగుతున్నాయి. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వరకు మద్యం తాగుతూ గొడవలకు దిగుతున్నారు. ఎన్‌జీవోస్‌కాలనీ రోడ్డులో మద్యం దుకాణంలో రాత్రి వరకు మద్యం తాగి ఘర్షణకు దిగారు. ఇందులో భూపాలపల్లి జిల్లాలో పని చేస్తున్న పోలీసు సిబ్బంది ఉన్నారు. నగరానికి చెందిన మరో వ్యక్తికి పోలీసు సిబ్బందికి మధ్య గొడవ జరిగింది. ఇద్దరు దాడులు చేసుకున్నారు. చివరకు పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. ఇలా తరచు సంఘటనలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించే పోలీసు సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఇలాంటి వాటిని అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం తాగిన తర్వాత ఘర్షణకు తావులేకుండా ఎవరి ఇంటికి వారు వెళ్లాలని మందుబాబులకు, సమయం దాటాకా మద్యం విక్రయాలు చేయొద్దని దుకాణాదారులకు పోలీసులు హెచ్చరికలు చేస్తున్నారు.

గతంలోనూ..

ఆరు నెలల కిందట దారి దోపిడీలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులపై పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు. వీరు గతంలో పలు నేరాలు చేశారు. కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఆరుగురు నగరంలో నిర్మానుష్యమైన ప్రాంతాలకు వెళ్లి దంపతులు, ప్రేమికులు ఎవరైనా వస్తే వారిని బెదిరించి వారి వద్ద డబ్బులు తీసుకునే వారు. వీరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గతంలోనూ వీరు ఇలాంటి నేరాలకు పాల్పడటంతో వారిపై పీడీ యాక్టు నమోదు చేశారు. అక్రమ వ్యాపారాలు, గుడుంబా తయారీ, గంజాయి రవాణా, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కూడా పోలీసులు పీడీ యాక్టును నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి వారికి సంబంధించిన జాబితాను తయారు చేస్తున్నారు. గతంలో పలుసార్లు ఇలాంటి కేసులలో ఉన్న వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

రూ.లక్ష విలువైన ఆభరణాల చోరీ

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో 30 తులాల బంగారం అపహరణ



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

మహబూబాబాద్ క్రైం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని శనివారం అర్ధరాత్రి ఒక విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారికి అలంకరించిన రూ.లక్ష విలువైన ఆభరణాలు దొంగలు దోచుకున్నారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌లోని అంకటి సురేందర్ అనే విశ్రాంత ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులు శ్రావణ మాసంలోని చివరి శుక్రవారం కావడంతో అమ్మవారికి మూడు రోజులుగా పూజలు చేస్తున్నారు. ఆయన పెద్ద కుమార్తె సుష్మ, భార్య గీతలకు చెందిన మొత్తం 30 తులాల బంగారు ఆభరణాలు అమ్మవారి విగ్రహానికి అలంకరించారు. సురేందర్ తెల్లవారుజామున మూడు గంటల దాకా ఇంట్లో టీవీ చూస్తున్నాడు. ఉదయం 6 గంటల సమయంలో బయటకెళ్లి వస్తుండగా అమ్మవారికి ఉన్న గది తలుపులు తీసి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా అమ్మవారి వెండి విగ్రహంతో పాటు అలంకరించిన బంగారు ఆభరణాలు దొంగలు దొచుకుపోయినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ రాజమహేంద్రనాయక్ అక్కడికి వచ్చి కుటుంబ సభ్యులను విచారించారు. అనుమానితుల గురించి ఆరా తీశారు.

ఇల్లు తుడిచే కర్ర సహాయంతో

సురేందర్ ఇంట్లో జరిగిన చోరీ ఇల్లు తుడిచే కర్రతో జరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగైదు రోజులుగా వర్షం కురవడంతో కిటికీలు పట్టడం లేదు. దీంతో పెట్టకుండానే వదిలేస్తున్నారు. సురేందర్ ఇంట్లో ఉన్న ఇల్లుతుడిచే కర్రకు ఉన్న రింగ్ సహాయంతో ఆలయ గదికి ఉన్న తలుపు బెడం తీసి ఉంటారని, ఇంటి గురించి పూర్తిగా తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయమై డీఎస్పీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ టౌన్ సీఐ జబ్బార్, సీసీఎస్ ఎస్సై కనకయ్యల ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలువైన బంగారు ఆభరణాలు ఇళ్లలో పెట్టుకోవద్దని, లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలించాయి.

పురుగుల మందు తాగి మహిళ మృతి

ఉగ్గంపల్లి(చిన్నగూడూరు), న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో చోటుచేసుకుంది. చిన్నగూడూరు ఎస్సై అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఉగ్గంపల్లికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆది భిక్షం భార్య సోమక్క(60) కొన్ని నెలల క్రితం ట్రాక్టర్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడింది. గాయాలకు తోడు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల కారణంగా తీవ్ర అనారోగ్యం పాలయింది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సోమక్క మృతి పట్ల ముదిరాజ్ సంఘం బాధ్యులు బీసు మల్లేశం, సర్పంచి దారమల్ల మంజుల తదితరులు సంతాపం తెలిపారు.

గంగమ్మ ఆలయంలో చోరీ



హుండీని చూపిస్తున్న పూజారి అయిలయ్య

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: చిన్నగూడూరు శివారు ఆకేరు వాగు సమీపంలోని గంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లినట్లు పూజారి మార్నాని అయిలయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొమ్ము నర్సయ్య, చిత్తారి వెంకన్న, యాకన్న తదితరులు తెలిపారు. గతంలో కూడా ఆలయంలో చోరీ జరిగిందన్నారు.



నిజాయితీ చాటుకున్న యువకుడు



డీఎస్పీ ఆధ్వర్యంలో బాధితులకు దొరికిన బ్యాగు అందజేస్తున్న వెంకటేశ్

మహబూబాబాద్ క్రైం, న్యూస్‌టుడే: ఒక యువకుడు దొరికిన నగదును దాచుకోకుండా పోగొట్టుకున్న వారి వివరాలు సేకరించి పోలీసుల సమక్షంలో అప్పగించాడు. జిల్లా కేంద్రంలో ఆ యువకుడు తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని రామచంద్రాపురానికి చెందిన వెర్పుల వెంకటేశ్ అనే యువకుడు పోస్టల్ శాఖలో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో తన స్నేహితుడు ఉన్న బీసీ కాలనీకి వెళుతుండగా ఆర్వోబీ వద్ద ఒక బ్యాగు కనిపించింది. ఆ సమయంలో సమీపంలో స్థానికంగా ఎవరూ లేకపోవడంతో ఆ బ్యాగులోని వస్తువులను పరిశీలించాడు. అందులో చీరలు, మరో చిన్న బ్యాగులో నగదు ఉంది. అందులో ఉన్న ఫోన్ నెంబర్ల ఆధారంగా షరీఫ్ అనే వ్యక్తితో చరవాణిలో వెంకటేశ్ మాట్లాడారు. బ్యాగులో రూ.48 వేల నగదుతో పాటు రూ.30 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు. నగదు చెల్లించేందుకు ఇటీవల చిట్టీ నగదు తీసుకొని కురవి మండలంలోని సుదన్‌పల్లికి వెళుతుండగా ఆర్వోబీ వద్ద పడిపోయినట్లు వివరించారు. వెంకటేశ్ బ్యాగును పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విషయం చెప్పాడు. పోలీసుల సమక్షంలో బాధితుడు షరీఫ్‌కు దొరికిన బ్యాగు వెంకటేశ్ అందజేశాడు. రూ.48 వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలు, దుస్తులు అందజేసిన వెంకటేశ్‌ను డీఎస్పీ రాజమహేంద్రనాయక్ సన్మానించి అభినందించారు. సీఐ జబ్బార్, ఎస్సైలు తిరుపతి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



చెట్టును ఢీకొన్న జీపు (ఇన్‌సెట్‌లో రాజు పాతచిత్రం)

నల్లబెల్లి, న్యూస్‌టుడే: వేగంగా వస్తున్న జీపు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందిన సంఘటన నల్లబెల్లి మండలంలోని మామిండ్ల వీరయ్యపల్లిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మామిండ్ల వీరయ్యపల్లి గ్రామానికి చెందిన మంద రాజు(35) నాగరాజుపల్లి వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రయాణికులను నర్సంపేట నుంచి నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామంలో శనివారం రాత్రి దింపేశాడు. వర్షం కురుస్తుండటంతో అర్ధరాత్రి తిరిగి నర్సంపేటకు వెళుతున్నాడు. మామిండ్ల వీరయ్యపల్లి గ్రామం దాటగానే అతి వేగంగా వెళుతున్న జీపు కల్వర్టు వద్ద ఉన్న చెట్టును ఢీకొంది. రాజుకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున అటువైపుగా వస్తున్న కూరగాయల వ్యాపారి గమనించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. రాజు అప్పటికే మృతిచెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ హరిబ్రహ్మాచారి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతుడి తల్లి శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పంచనామా నిమిత్తం నర్సంపేటకు తరలించారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు కృష్ణవేణి, కావేరి ఉన్నారు. సంఘటన స్థలానికి గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కుటుంబ సభ్యులను తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు.

ముత్యాలమ్మ తండాలో చోరీ

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండలం మహమూద్‌పట్నం శివారు ముత్యాలమ్మ తండాలో శనివారం రాత్రి ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రెండు తులాల పుస్తెల తాడు అపహరించినట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మ తండాకు చెందిన వాంకుడోతు సుమన్, శిరీష దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి శిరీష మెడలో పుస్తెలతాడు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు

పాత జిల్లాల ప్రాతిపదికనే
క్రీడాకారుల ఎంపిక
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్ణయంతో విద్యార్థుల్లో నిరాశ


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (పాతచిత్రం)

దేవరుప్పుల, న్యూస్‌టుడే

కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతున్న పాఠశాల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్ణయం నిరాశను మిగిల్చింది. పాత జిల్లాల ప్రాతిపదికనే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఇటీవల ఫెడరేషన్ ప్రకటించడంతో విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిరుడు కొత్త జిల్లాలు ఏర్పడిన సమయంలో పాఠశాలల విద్యార్థులు ఎగిరి గంతేశారు. కొత్త జిల్లాల పరిధి తక్కువగా ఉండడంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని మురిసిపోయారు. అనంతరం ఫెడరేషన్ విడుదల చేసిన స్పోర్ట్స్ క్యాలెండర్‌లో వివరాలు, అర్హతలు చూసి అవాక్కయ్యారు. క్రీడాకారులు కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఉంటున్నా.. అవిభాజ్య జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపితేనే రాష్ట్ర జట్టుకు ఎంపికవుతారని ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో తమకు ప్రాధాన్యం ఉండదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా పాఠశాలల స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపే విద్యార్థులను గుర్తించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ఇదే క్రమంలో క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 14, 17 ఏళ్ల వయస్సున్న వారిని రెండు విభాగాలుగా గుర్తించి పోటీలు నిర్వహిస్తారు. మొత్తం డెబ్బై రకాల క్రీడలు ఉంటాయి. అన్ని ఆటలు అన్ని ప్రాంతాల్లో అంతగా ప్రచారంలో లేకపోవడంతో స్థానికంగా ఆదరణ కలిగిన ఆటలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తారు. ఆగస్టు నెలాఖరు నాటికి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి సెప్టెంబర్ మొదటి వారంలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని పాఠశాలల్లో 8వ తరగతి లోపు చదివే విద్యార్థులు 14 ఏళ్ల విభాగంలో, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు 17 ఏళ్ల విభాగంలో పోటీ పడాల్సి ఉంటుంది. తెలంగాణ జిల్లాలకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాస్కెట్ బాల్ బేస్‌బాల్, వ్యక్తిగత ప్రతిభ చూపే క్రీడాంశాలను కూడా నిర్వహిస్తారు.

గతంలో ఎలా నిర్వహించేవారు: గతంలో పాఠశాలల స్థాయి, మండల స్థాయి పోటీలు నిర్వహించి అక్కడ ప్రతిభ చూపిన వారిని ఒక జట్టుగా గుర్తించి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆడించి జిల్లా జట్టుకు ఎంపిక చేసేవారు. అన్ని జిల్లాల క్రీడాకారులు ఆయా అంశాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్టును ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపేవారు. మండలస్థాయిలో ఎంపికైన పాఠశాల విద్యార్థి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు ఎంతో అభ్యాసం చేయాల్సి వచ్చేది. ఎంతో సమయం, డబ్బులు కూడా ఖర్చయ్యేవి.

ఇప్పుడెలా?..: తొలుత పాఠశాలల స్థాయి, తర్వాత మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారు. జిల్లాస్థాయి పోటీలకు ఇంటర్ జోన్ అని పేరు పెట్టి అవిభాజ్య జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు క్యాలెండర్‌లో పేర్కొన్నారు. దీంతో కొత్త జిల్లాల స్థాయి పోటీలు ఉండవు. కొత్త జిల్లాల స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేస్తే పోటీ తక్కువగా ఉండి చాలా మందికి అవకాశం లభించేది. ఉదాహరణకు అవిభాజ్య వరంగల్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారే రాష్ట్ర జట్టులో స్థానం సంపాదిస్తారు. కొత్త జిల్లాల స్థాయిలో పోటీ నిర్వహిస్తే చాలామందికి అవకాశం లభించేది. కొద్దో గొప్పో ప్రతిభ ఉన్నవారికి అవకాశాలు అంతగా ఉండవు. పోటీ ఎక్కువగా ఉంటుంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో మరికొంత మంది ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని భావించారు. కానీ ఇది మునుపటి కన్నా అవకాశాలు తగ్గాయని క్రీడాకారులు వాపోతున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి: బెల్లంకొండ రమేశ్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, జనగామ జిల్లా.



కొత్త జిల్లాల ఏర్పాటుతో మరింత ఎక్కువ మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచే అవకాశాలు మెరుగుపడతాయని భావించాం. కానీ ఇటీవలి ప్రభుత్వ ప్రకటన మా ఆశలపై నీళ్లు చల్లింది. ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి. కొత్త జిల్లాల పరిధిలో ఎంపిక పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయాలి. ఇలా చేయకపోతే క్రీడాకారులు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది.

కొత్త జట్లను ఎంపిక చేయాలి: తాటికాయల విజయకుమార్, రాష్ట్ర జట్టు వాలీబాల్ క్రీడాకారుడు, జిప సెపాఠశాల, హిమ్మత్‌నగర్.



మేం ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కొత్త జిల్లాల ఏర్పాటుతో మేం రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎదగాలని అభ్యాసం చేశాం. ప్రభుత్వ ప్రకటన మమ్మల్ని నిరాశపరిచింది. ఇప్పటికే క్రీడా క్యాలెండర్‌ను ప్రకటించిన నేపథ్యంలో కొత్త జిల్లాల నుంచి జిల్లా జట్టును ఎంపికచేసుకునేలా నిబంధలను సవరిస్తే మాకు జాతీయస్థాయిలో ఆడే అవకాశం లభిస్తుంది.

వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించాలి
ఎంపీ లక్ష్మీకాంతరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: గ్రామాల్లోని పేద ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించటం అభినందనీయమని ఎంపీ లక్ష్మీకాంతారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఇన్‌ఫిక్స్ అసోసియేషన్, స్టార్‌హెల్త్ బీమా కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత గుండె, షుగర్, రక్తపరీక్షల శిబిరం నిర్వహించారు. లక్ష్మీకాంతరావు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి వైద్యం చేయించుకుంటే సొమ్ము ఆదా అవుతుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఘనత తెరాస ప్రభుత్వానికే దక్కిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించే నిర్వాహకులకు తన వంతు చేయూతనిస్తానన్నారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి చెందిన వైద్యులు గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు. అతిథులను ఇన్‌ఫిక్స్ సంస్థ ప్రతినిధులు వింజమూరి సుధాకర్, పినాకపాణి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ప్రధానకార్యదర్శి ఐవీఆర్ కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు, మహబూబాబాద్ జిల్లా సంయుక్త కలెక్టర్ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు, ఎంపీపీ కర్నె సోమయ్య, జడ్పీటీసీ సభ్యుడు కమలాకర్, పీఏసీఎస్ ఛైర్మన్ కొమురయ్య, అధికారులు పాల్గొన్నారు.

కూలిన గోడను పరిశీలించిన పురావస్తుశాఖ ఫోర్‌మెన్


కొలతలు వేస్తున్న పురావస్తుశాఖ ఫోర్‌మెన్ మల్లేశం

వెంకటాపూర్,న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని శనివారం కూలిన రామప్ప ప్రహరీ గోడను పురావస్తుశాఖ ఫోర్‌మెన్ మల్లేశం ఆదివారం పరిశీలించారు. గోడ కూలడానికి కారణాలు, ఎక్కడ నుంచి ఎక్కడి వరకు పడిపోయింది. దాని పొడవు, పడిపోయిన రాళ్ల పొడవు, వెడల్పుల కొలతలను సేకరించారు. తీసుకున్న కొలతల ఆధారంగా తిరిగి నిర్మించడం కోసం అయ్యే ఖర్చు ఎంత ? ఎలా నిర్మిస్తే చారిత్రక నేపథ్యం కలిగిన పురాతన రాళ్లు దెబ్బతినకుండా మళ్లీ పూర్వ వైభవం తీసుకురావచ్చనే నేపథ్యంలో సందర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ప్రతిపాదనలు పంపించి సాధ్యమైనంత త్వరగా గోడ నిర్మాణం చేపడుతామన్నారు. ఆయన వెంట పురావస్తుశాఖ సిబ్బంది నాగరాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

బాధల నుంచి వచ్చేదే కవిత్వం
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



కుంపటి కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న నవీన్

మానుకోట, న్యూస్‌టుడే: బాధల నుంచి.. కష్టాల అనుభవాల నుంచి వచ్చేదే గొప్ప కవిత్వమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ అన్నారు. గాయకుడు మండవరాజు మల్లేశ్ రాసిన 'కుంపటి' కవితా సంపుటిని ఆయన ఆదివారం స్థానిక వర్తక సంఘంలో దళిత బహుజన రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక (దబరకమే) ఆధ్వర్యంలో ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మనిషి అంతరంగంలో మార్పు రావాలని మల్లేశ్ తన కవిత్వంలో ఆకాంక్షించారని ఇది ఎంతో గొప్ప విషయమని వివరించారు. అంతరంగంలో మనం ప్రశ్నించుకున్నప్పుడే.. మనల్ని మనం ఉన్నతీకరించుకోవచ్చన్నారు. అప్పుడే చెడు నుంచి హింసా ప్రవృత్తుల నుంచి బయటపడగలమని చెప్పారు. మల్లేశ్ తన జీవితంలో పడిన బాధలను, వివక్షతను, అణచివేతను, అవమానాలను అక్షర రూపంలో అద్భుతంగా కవిత్వీకరించాడని, దీంతో పాటు శ్రమజీవుల పక్షం వహించాడని నవీన్ కొనియాడారు. దబరకమే రాష్ట్ర అధ్యక్షుడు సీతారాములు మాట్లాడుతూ బహుజన రచయితలు, కవులు రాస్తున్న సాహిత్యాన్ని తమ వేదిక ప్రోత్సహిస్తోందని ఇప్పటికే మూడు ప్రచురణలు వెలువరించామన్నారు. సమావేశంలో పలువురు కళాకారులు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. దబరకమే రాష్ట్ర కార్యదర్శి కొమిరె వెంకన్న పుస్తక పరిచయం చేశారు. కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు, సంగీత దర్శకుడు బోలేశావలి, రచయిత డాక్టర్ సీతారాం, కవులు, గేయ రచయితలు సయ్యద్ ఖుర్షీద్, దార్ల రామచంద్ర, మద్దెర్ల రమేశ్, కందుల ప్రేంకుమార్, ఎన్ఎస్ఎస్ పూర్వ అధికారి సత్యనారాయణ, నాగేశ్వరరావు, జబర్దస్త్ ఫేం రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. జిల్లా నుంచి పలువురు కవులు, రచయితలు, కళాకారులు సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ తల్లికి బోనాలు
నగరంలో ముగిసిన శ్రావణ బోనాలు


ఉత్సవాల్లో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్


వడ్డేపల్లిలోని పోచమ్మ దేవాలయం వద్ద బోనాల సందడి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా నగరంలో భక్తులు వేయిగండ్ల పోచమ్మతల్లికి వైభవంగా బోనాలు సమర్పించుకున్నారు. వడ్డేపల్లిలోని పోచమ్మతల్లి దేవాలయంలో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోచమ్మబోనాల సందర్భంగా వడ్డేపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్‌కాలనీ ఫేజ్-2 జంక్షన్ నుంచి వడ్డేపల్లి పోచమ్మదేవాలయం వరకు చేపట్టిన అమ్మవారి రథయాత్రను పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పూజలు చేసిన అనంతరం ప్రారంభించారు. పోతరాజుల విన్యాసాలు వడ్డేపల్లివాసులను అలరించాయి. స్థానిక కార్పొరేటర్లు దాస్యం విజయ్‌భాస్కర్, కేశబోయినఅరుణ, మిడిదొడ్డి స్వప్నలతోపాటు వడ్డేపల్లి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


బోనంతో యువతి


కళాకారుల విన్యాసం


పోతురాజుల విన్యాసాలు



TENTH English

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

ప్రతిభ

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us <u>from</u> many diseases.
2. A man is known <u>by</u> the company the keeps.
3. Foundation of a house lies <u>below</u> the ground level.
4. Srinidhi has no appetite <u>for</u> sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived <u>on</u> time. (Time)
2. I met Sahithi <u>at</u> the theatre. (Place)
3. Shirisha went to the market <u>for</u> fruits. (Purpose)
4. Rishita drove <u>along</u> the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor <u>till</u> he returned. (Time)
2. Naveen left Boath <u>for</u> Dubai. (Place)
3. <u>Inspite of</u> the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in <u>between</u> the two houses.
2. The moon moves <u>around</u> the Earth.
3. <u>Inside</u> the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue <u>beyond</u> the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc.

Examples:

1. The rowdy was arrested <u>according to</u> IPC 420.
2. I cannot see the film because a tall man is sitting <u>infront of</u> me.
3. Vijayendra Prasad goes to school <u>along with</u> Vamsi Krishna daily.
4. Ring the alarm bell <u>in case of</u> emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house <u>by means of</u> a broken window.

2. Shruthi attends special classes on Sundays <u>in addition to</u> regular practice.
3. We postponed our trip to Ramoji Film City <u>due to</u> bad weather.
4. <u>Inspite of</u> being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of

2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from

3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with

4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to
c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్‌జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ చోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ.4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ.490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహూరు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహూరు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపుష్ఠం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ.43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ.1600 కోట్లు వెచ్చించనుంది.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!


- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద

సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే	5. Pay	వే
2. Flute	వే	6. God	వే
3. Speed	వే	7. Function	వే
4. Heat	వే	8. Dawn	వే

- డీ దయామతి, హన్మకొండ



దారేది?

చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడి పొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మ త్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.





చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలిసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ

సీకేఎం ఆసుపత్రిలో దారుణం

☛ బాత్రూంలో యాసిడ్ మీదపడి బాలిక, ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు

☛ ఎంజీఎం ఆసుపత్రికి తరలింపు ☛ విచారణ చేపట్టిన ఇంతేజార్‌గంజ్ పోలీసులు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: వరంగల్ సీకేఎం ఆసుపత్రిలోని బాత్రూలను శుభ్రం చేయడానికి ఉపయోగించే యాసిడ్ మీదపడి మూడేళ్ల బాలికతో పాటు, ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్సను ప్రారంభించారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నారని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. సీకేఎం ఆస్పత్రి

ప్రసూతి వార్డులోని బాత్రూంను శుభ్రం చేయడానికి స్వీపర్ యాడిడ్ చల్లింది. ఈ విషయం తెలియక వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అపాత్ పార్వతి తన కూతురు సిరివల్లి (3)ని బాత్రూంకు తీసుకెళ్లింది. అప్పటికే బాత్రూంను శుభ్రంచేస్తున్న స్వీపర్ లోనికి రావద్దని వారించి బయటకు తోసింది. దీంతో తల్లి పార్వతి చెయ్యి పట్టుకుని నడుస్తూ వెళ్లిన చిన్నారి సిరివల్లి కాలుజారి కిందపడింది. అప్పటికే నేలపై ఉన్న యాసిడ్ బాలిక శరీరాన్ని తాకింది. తల్లి చిన్నారిని పైకి లేపుతుండగా యాసిడ్ తగిలి ఆమే చేతికి గాయాలయ్యాయి. రూరల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిమల్లంపల్లికి చెందిన స్వాతి ప్రసవం కాగా పార్వతి, సిరివల్లితో కలిసి ఆమెను చూసేందుకు శనివారం ఆస్పత్రికి వచ్చింది. అదే సమయంలో రూరల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన బుద్దేటి మౌనికను ఆమె తల్లి కరీమాబాద్‌కు చెందిన కావటి భాగ్యలక్ష్మి బాత్రూంకు తీసుకెళ్లగా యాసిడ్ కాళ్లపై పడి గాయాలయ్యాయి. మౌనికను రక్షించడానికి ప్రయత్నించిన తల్లి భాగ్యలక్ష్మి మోచేతిపై, పొట్ట వద్ద గాయాలయ్యాయి. మౌనికకు గర్భస్రావం కావడంతో శనివారం కుటుంబ సభ్యులు సీకేఎం ఆసుపత్రిలో చేర్పించారు. యాసిడ్ గాయాలైన వీరిని ఆసుపత్రి వైద్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నారు.



చిన్నారి గాయాలను పరిశీలిస్తున్న నేతలు

మహిళా కాంగ్రెస్ నేతల ఆందోళన..

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆసుపత్రిలోని మహిళలకు పండ్లు పంపిణీ చేయడానికి వచ్చిన జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పోశాల పద్మ, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ యాసిడ్ బాధితులను పరామర్శించారు. బాత్రూంలో యాసిడ్ వేసినప్పుడు లోనికి ఎవరూ వెళ్లకుండా చూడరా.. కనీసం ఎవరూ వెళ్లొద్దని ముందస్తుగా చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఆసుపత్రిలోని వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈవిషయంపై సీకేఎం ఆసుపత్రి డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టరు సుధను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా బాత్రూంలో యాసిడ్ వేసిన విషయం తెలియక లోనికి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు.



గాయాలతో చికిత్స పొందుతున్న మహిళ



గాయపడిన రోగి బంధువు

నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కేసు..

ఆస్పత్రిలో బాలికతో పాటు ఇద్దరు మహిళలు గాయపడిన సంఘటనపై ఇంతేజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదుచేశారు. బాత్రూంను శుభ్రంచేయడానికి యాసిడ్ చల్లిన స్వీపర్ అందులోకి ఎవరినీ వెళ్లకుండా చూడాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు ఆస్పత్రికి వచ్చిన ఇంతేజార్‌గంజ్ సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై వెంకటకృష్ణ విచారణ చేపట్టారు. స్వీపర్ అనిత, సూపర్‌వైజర్, ఫీల్డ్ ఆఫీసర్ ఖాజాలపై కేసు నమోదుచేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

పాము కాటుతో బాలిక మృతి



సిరివెన్నెల(పాత చిత్రం)

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని పోలీస్ క్వార్టర్‌లో నిద్రిస్తున్న బాలిక సిరివెన్నెల(9) ఆదివారం తెల్లవారుజామున పాముకాటుతో మృతి చెందింది. ఈ సంఘటన పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న కుంటుంబాల్లో కలకలం రేపింది. బాలిక నాలుగో తరగతి చుదువుతోంది. శనివారం రాత్రి 11 గంటలవరకు ఇంట్లో చాపపై కూర్చొని చదువుకుంది. తర్వాత అక్కడే పడుకుంది. అప్పుడు గదిలోకి వచ్చిన కట్లపాము బాలికను కాటు వేసింది. శరీరం మంటగా అనిపిస్తుందని తల్లిదండ్రులకు చెప్పగా విషయం తెలియని తల్లిదండ్రులు ఉపశమన చర్యలు చేపట్టారు. అనుమానం వచ్చి చాపను తీయగా కింద కట్లపాము కనిపించింది. కంగారు పడిన తల్లిదండ్రులు ఆదివారం తెల్లవారుజామున ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆలస్యం జరిగిందని చెప్పిన వైద్యులు చికిత్స కొనసాగిస్తుండగానే బాలిక ప్రాణాలు విడిచింది. శవపరీక్షలు నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు తమ స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషన్ తఫ్సీర్ ఇక్బాల్ బాలిక మృతదేహాన్ని సందర్శించి తల్లిదండ్రులను ఓదార్చారు. చిన్నారి సిరివెన్నెల తల్లి పోలీస్ శాఖ పర్యవేక్షణలో నడుస్తున్న కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తుండగా తండ్రి ఉపేంద్ర ఆటో డ్రైవర్. చిన్నారి బాలిక మృతి పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఇద్దరికి గాయాలు

ములుగు రూరల్,న్యూస్‌టుడే: మండలంలోని అన్నంపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పొట్లాపురం గ్రామానికి చెందిన ములుగల వెంకటేశ్వర్‌రెడ్డి, సూరబోయిన సందీప్‌లు పనుల నిమిత్తం ములుగుకు వచ్చారు. పనులను పూర్తి చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అన్నంపల్లి వద్ద మిషన్ భగీరథ పనుల కోసం వేసిన పైప్‌లు వర్షానికి రోడ్డు పైకిరాగా గమనించకుండా పైప్‌ను ఢీకొట్టి కింద పడ్డారు. ప్రమాదంలో వెంకటేశ్వర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు బాధితున్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. స్వల్ప గాయాలైన సందీప్ ములుగు సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మనపై సూర్యగ్రహణం ప్రభావం ఉండదు

ఐనవోలు అనంత మల్లయ్యసిద్ధాంతి

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: సోమవారం సంభవించనున్న సంపూర్ణ సూర్యగ్రహణం మన భారతదేశంలో కనిపించదని అందుకు ఎవరూ ఎలాంటి నియమాలు పాటించనవసరంలేదని భద్రకాళి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి ఐనవోలు అనంత మల్లయ్య సిద్ధాంతి ప్రకటనలో తెలిపారు. ఉత్తర అమెరికా, పాత అమెరికా ఫసిఫిక్ అట్లాంట ప్రాంతాల్లో కనిపిస్తుందని, మనకు కనిపించని సూర్యగ్రహణానికి మనం భయపడాల్సిన అవసరంలేదని ఆయన వెల్లడించారు. దేవాలయాలు యథావిధిగానే తీసి ఉంచవచ్చని, గర్భిణులు కూడా తమ దైనందిన జీవితాన్ని యథేచ్ఛగా సాగించవచ్చని ఆయన తెలిపారు. సోమవారం అమావాస్య వచ్చినందున విశేషంగా భావించి శివుడికి అభిషేకాలు చేస్తే శుభం జరుగుతుందని సిద్ధాంతి వివరించారు.

రాబోవు రోజుల్లో ప్రభుత్వ పతనం ఖాయం

ములుగు రూరల్,న్యూస్‌టుడే: రాబోవు రోజుల్లో తెరాస ప్రభుత్వ పతనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సమన్వయకర్త పోదెం వీరయ్య అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఇంటింటికి కాంగ్రెస్- మన ఊరికి మన వీరన్న' అనే కార్యక్రమాన్ని మహ్మద్‌గౌస్‌పల్లిలో ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మల్లాడి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ మస్రగాని వినయ్‌కుమార్ యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు వేములపల్లి భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొలకెత్తని మిరప విత్తనాలు

న్యాయం చేయాలంటున్న రైతు

పర్వతగిరి, న్యూస్‌టుడే: మంచి దిగుబడి వస్తుందని నమ్మబలికి, నకిలీ విత్తనాలు అంటగట్టి మోసం చేశారంటూ వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన రైతు పల్లకొండ యాకయ్య వాపోయారు. స్థానికంగా ఆదివారం ఆయన వివరాలు తెలియజేశారు. గత సంవత్సరం నుంచి తను మిర్చి సాగు చేస్తున్నారు. వరంగల్‌లోని ఓ దుకాణంలో జులై 4న విత్తనాలు కొనేందుకు వెళ్లగా, దుకాణ యజమాని వినస్ పేరుగల విత్తనాలను రూ.3,800 తీసుకుని పది ప్యాకెట్లు ఇచ్చినట్లు తెలిపారు. అవి మొలకెత్తకపోవడంతో దుకాణ నిర్వాహకులతో మాట్లాడగా, అదే నెల 19న రూ.2,660 తీసుకుని మరో ఏడు ప్యాకెట్లను ఇచ్చినట్లు తెలిపారు. వాటిని అలికినప్పటికీ, మొలకలు రాలేదు. దుకాణ నిర్వాహకులకు తెలుపగా ఇద్దరు వ్యక్తులు వచ్చి నారుమడిని చూసి వెళ్లినట్లు చెప్పారు. నకిలీ విత్తనాలు ఇచ్చి మోసం చేసినందున, మిర్చి నారు ఇప్పించాలని కోరగా, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని వాపోయారు. దుకాణ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి శశికాంత్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా విత్తనాలు మొలకెత్తని విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మడికొండ, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన అర్బన్ జిల్లా మడికొండలో ఆదివారం వెలుగు చూసింది. పర్వతగిరి మండలం గట్టికల్‌కు చెందిన సోమేశ్వర్ కుమార్తె మేఘన(28)ను మడికొండకు చెందిన పత్తిపాక ప్రవీణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక పాప ఉంది. ఆదివారం మేఘన స్నానాల గదిలో జారి పడడంతో తలకు దెబ్బ తగిలి చనిపోయినట్లు భర్త ప్రవీణ్ చెబుతున్నారు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని, అల్లుడే హత్య చేసి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కట్టు కథ అల్లుతున్నాడని మృతురాలు తండ్రి ఆరోపించారు. విషయం తెలుసుకున్న మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, ఎస్సై మధుప్రసాద్ ఘటనాస్థలానికి సందర్శించి వివరాలు సేకరించారు. విచారణలో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్

01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్

01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్

03:30 హంగామా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 ఈ-జంక్షన్

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ. 6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ. 9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఫీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – ఛాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

లక్నవరం మత్తడి.. ఆశల పుత్తడి..!


లక్నవరం కాటేజీల వద్ద వరద నీటి ఉద్ధృతి


మత్తడి పోస్తున్న జలాశయం

గోవిందరావుపేట,న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయం ఆదివారం నుంచి మత్తడి పోస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో ఆదివారం తెల్లవారే సరికే పూర్తి స్థాయి నీటి మట్టాన్ని (34 అడుగులు) దాటి పోయింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశీయులు కూడా జలాశయాన్ని సందర్శించారు. పడవ ప్రయాణంతో పర్యటకులు సంతోషంగా గడుపుతున్నారు. నీటిపారుదలశాఖ ఈఈ రవీందర్, డీఈఈ యశ్వంత్, ఏఈ సుధీర్ జలాశయాన్ని సందర్శించారు.

జలపాతంలో సందర్శకుల కేరింతలు

వాజేడు, న్యూస్‌టుడే: వరద నీటితో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న బొగత జలపాతాన్ని తిలకించిన సందర్శకులు ఆనందంతో తన్మయత్వం చెందుతున్నారు. హోరుమనే శబ్దంతో హొయలొలుకుతున్న జలపాతాన్ని తిలకించిన సందర్శకులు పరవశం చెందుతున్నారు. జలపాతంలో ఎగిసిపడుతున్న నీటి తుంపర పర్యాటకులకు కనువిందు చేస్తోంది. మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. అటవీ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో జలపాతం నిండుగా నీటి గుండంలో దూకుతోంది. జలపాతాన్ని తిలకించిన పర్యాటకులు అబ్బురం చెందుతున్నారు. వరద నీటిలో పర్యాటకులు కోలాహలంగా గడుపుతున్నారు. పాల నురుగులా ప్రవహిస్తున్న వరద నీటిలో చిన్నారులు, మహిళలు కేరింతలతో ఉల్లాసంగా గడిపారు. జలపాతం నుంచి వస్తున్న వరదనీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో సమీపంలో ప్రవహిస్తున్న వరద నీటిలోనే పర్యాటకులు గడిపారు.


జలపాతం వద్ద పర్యాటకుల సందడి


నీటిలో ఉల్లాసంగా...

కేసీఆర్‌కు అవార్డు గర్వకారణం


పార్టీ నేతలతో కలిసి మాట్లాడుతున్న రవీందర్‌రావు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ పురస్కారం రావడం యావత్ తెలంగాణ ప్రజలకు గర్వకారణమని తెరాస పార్టీ జిల్లా అధ్యక్షుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు పేర్కొన్నారు. హన్మకొండలోని తెరాస జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిటీ జాతీయస్థాయిలో కేసీఆర్‌కు అవార్డు ప్రకటించడం గొప్పగా భావిస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ మూడేళ్లుగా రైతుబాంధవుడిగా, హరిత తెలంగాణ, బంగారు తెలంగాణ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారని, రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 24 గంటలూ విద్యుత్తు సరఫరా జరుగుతుంటే, రోజంతా కరెంటు వద్దు బాబోయ్ అని రైతులే విన్నవిస్తున్న పరిస్థితిని ప్రతిపక్ష నేతలు గమనించాలన్నారు. మార్కెట్లో రైతుబంధు పథకం అమలు, రూ.2 లక్షల వరకు రైతుబంధు ద్వారా రుణం మంజూరు, పొరపాటున ఏ రైతు చనిపోయినా రూ.6 లక్షల నష్టపరిహారం ఇస్తున్న విషయాలను ప్రస్తావించారు. రూ.45 వేల కోట్లతో మిషన్ కాకతీయ పనులు చేపట్టడంతో చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయని, ఫలితంగా రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరిస్తోందని చెప్పారు. జై జవాన్, జై కిసాన్, జై కేసీఆర్ నినాదంతో తెరాస ముందుకెళుతోందన్నారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ ధర్మరాజు మాట్లాడుతూ రైతులకు మార్కెట్లో జరుగుతున్న మేళ్ల గురించి వివరించారు. సమావేశంలో జనగామ జిల్లా గ్రంథాయల సంస్థ ఛైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, తెరాస నాయకులు భీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, చింత సదానందం, యాకుబ్‌రెడ్డి, చిర్రరాజు, సెవెల్లి సంపత్, మల్లయ్య యాదవ్, రవియాదవ్, ఐసీడీఎస్ ప్రాంతీయ ఆర్గనైజర్ కమరున్నీసాబేగం, ఎల్లావుల లలితాయాదవ్, రహమున్నీసా, శ్రీజానాయక్, పగిడిపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాము కాదు.. చేప!

చిత్రంలో మీరు చూస్తున్నది పాము కాదు. చేప.. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం మండలం కల్లెడ సమీపం ఆకేరువాగులో ఆదివారం స్థానిక యువకులు చేపలు పడుతుండగా ఈ చేప లభించింది. స్థానికంగా మలుగుమేను అని పిలిచే ఈ చేపలు ఒకటి, రెండు అడుగులు ఉంటాయని, ఇది మాత్రం మూడు అడుగులకు పైగా పొడవుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. అచ్చం పాములా ఉందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, పర్వతగిరి





చవితికి ముందే వచ్చిన బెండ గణపతి

ఎనుమాముల (కాశీబుగ్గ), న్యూస్‌టుడే: ఇందుగలడందుగలడనే సందేహము వలదు.. ఎందెందు వెతికినా అందందేగలడు అన్నట్లుగా గణపతి దేవుడు ఓ బెండకాయ ఆకారంలో దర్శనమిచ్చాడు. పార్వతీ తనయుడిలా తొండం, కన్నుతో చూడచక్కని రూపంతో ఆకట్టుకుంటున్న బెండకాయని చూసి స్థానికులు అచ్చెరువొందుతున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎనుమాములలోని కోటిలింగాల దేవాలయానికి సమీపంలో ఉండే బుద్దె మల్లికార్జున్, మమత దంపతుల పెరట్లో బెండమొక్కకు వినాయకుడిని పోలినట్లుగా కాయకాసింది. తాము అద్దెకుండే ఇంటి పెరట్లో నెల రోజుల క్రితం విత్తనాలు నాటారు. ప్రస్తుతం కాయలు కాస్తున్నాయి. తొలి కాపులో ఓ 10 బెండకాయలు రాగా అందులో ఒకటి అచ్చంగా బొజ్జ గణపయ్య తొండాన్ని పోలినట్లు, గణపయ్య కన్నులా ఉండడంతో ఆ దంపతులు మురిసిపోతున్నారు. వినాయక చవితి పండగకు ముందే తమ ఇంటికి గణనాథుడు వచ్చాడని వారు చెబుతున్నారు. ఈ విషయం తెలిసి స్థానికులు చూసేందుకు ఆసక్తిగా తరలివస్తున్నారు.

నలుగురు పర్యాటకులను రక్షించిన రెస్క్యూ టీమ్

వాజేడు, న్యూస్‌టుడే: వరద నీటిని చూడగానే పర్యాటకులకు ఈత కొట్టాలనే తాపత్రయం.. అటవీ సిబ్బంది, వలంటీర్లు, రెస్క్యూ టీమ్ సభ్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకోని సందర్శకులు.. కంటికి రెప్పలా పర్యాటకులను గమనిస్తూ విధులు నిర్వహిస్తున్నా జలపాతంలో వరదనీటిలో మునక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మిత్ర బృందం జలపాతం సందర్శనకు వచ్చారు. ఉద్ధృతంగా వస్తున్న వరద నీటిలో ఈతకు వెళ్లరాదంటూ హెచ్చరిస్తున్నా వినకుండా నీటిలో దిగడంతోనే ఉద్ధృత ప్రవాహానికి నీట మునిగారు. పర్యాటకులు నీట మునగడంతో సందర్శకులు ఒక్కసారిగా భయంతో కేకలు వేయడంతో రెస్క్యూ టీమ్ సభ్యులు అప్రమత్తమయ్యారు. బొగత జలపాతం వరదనీటిలో ఈత కొడుతున్న నర్సంపేట, ములుగు ప్రాంతానికి చెందిన నలుగురు వరద నీటిలో మునగడంతో అప్రమత్తమైన రెస్క్యూ టీమ్ సభ్యులు కొప్పనాతి చిన్నశ్రీను ఇద్దరిని, కొప్పనాతి కృష్ణమూర్తి మరో వ్యక్తిని రక్షించడంతో సందర్శకులు ఊపిరి పీల్చుకున్నారు. వరద నీటిలో మునిగిపోతున్న వ్యక్తులలో మరొకరిని సందర్శకుడొకరు రక్షించారు. వరదనీటి ఉద్ధృతిని గుర్తించి వరద నీటిలో వెళ్లరాదంటూ హెచ్చరిస్తున్నా సందర్శకులు వినకుండా వరద నీటిలో ఇబ్బందులకు గురయ్యారని రెస్క్యూ టీమ్ సభ్యుడు కొప్పనాతి కృష్ణమూర్తి తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే ఎఫ్‌బీవో కేవల్‌రామ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వరదనీటిలోకి పర్యాటకులు వెళ్లకుండా నిరోధించాలని సిబ్బందికి సూచించారు.



